ఘాటెక్కే గంధక ధూమం

బి. టి. రామానుజం

చలికాలం రాకముందే చలి మొదలయింది.

రాత్రి అనుకోకుండా వాన పడింది. ఉదయం అయేసరికి చల్లగా వుంది.

ఫాక్టరీలు తెల్లవారకుండానే నల్లపొగను వదుల్తున్నాయి. పైనుంచి కిందకు పడ్తున్న మంచు పొగతో కల్సిపోయి వికృతంగా తయారయింది.

అక్కడ కూర్చున్న గురవయ్యకి అరవయ్యేళ్ళు దాటి ఏడాదయింది.

ఏళ్ళ పైబడి అతని వెన్నెముక వంగిపోయింది. దానికితోడు పంచదార బస్తాల బరువు దాన్ని, దయలేకుండా ఇంకా ముందుకు వంచేసింది. ఇప్పుడు ఆ వెన్నెముక అంతులేని చలిని పుట్టించి, అతన్ని వొణికిస్తోంది. ఎముకలను చలి కొరికేస్తుంటే చలిని ఆకలి కరకర నమిలేస్తోంది. ఆకలిలో వేడి రాజుకుంటోంది.

భూతంలా వుంటుంది పెద్దబజారు.

ఆ బజారు ఎంతుందో గురవయ్యకి అక్కణ్ణుంచి కన్పించదు. అయితే గురవయ్యకి అందులో ప్రతి కొట్టూ ఎరుకే.

ఇవేళ పొద్దున్న అక్కడ గోలా, గందరగోళం లేదు.

అంటే అక్కణ్ణుంచే కదిలే సరుకులు అక్కడే వున్నాయన్నమాట!

కొన్ని రోజుల నుంచీ సరుకుల కదలిక కన్నా మనుషుల కదలిక ఎక్కువయింది.

"ఓరి భగమంతుడా, మా బతుకులే దొరికాయా బుగ్గిసెయ్యటానికి" అన్నాడతను ఆకాశంలోకి చూస్తూ.

ఆకాశంలో ఎక్కడో ఓ మేఘం చాటున ఏదో పక్షి కదుల్తోంది. కాసేపటికి అతనికి అదీ కన్పించలేదు. కాసేపటికి కళ్ళు మసక అయిపోయాయి. చేతుల్తో కళ్ళు నులుముకొని, "మాయదారి బతుకులో పెతీదీ బూటకమేనాయె. ఇంక మనిషేటి నిలుస్తాడు" అనుకొన్నాడు.

"ఇసాపట్నం"కి కొన్ని మైళ్ళ అవతలకి వెళ్ళిపోయాయి అతని కళ్ళు. ఆలోచనలు అతని పాతికేళ్ళ ఎనక్కు జరిగిపోయాయి.

"నీకేటుంది. ఆ బొక్క ముక్క తప్పిస్తే. ఏటందుల నీకు కడుపు నిండి పోద్దేటి?" పోతరాజు ఓ మాదిరి కంట్రాక్టరు. దేన్లో అని అడక్కపోతే, అన్నింటికీనూ, లేబర్ సప్లయ్‌కీ, ఇళ్ళకీ ఇంకా చాలా వాటికి.

724

పోతరాజుతో పాటు ఉన్న మనిషెవరో గురవయ్యకి తెలీదు.

"అయితేటి సెయ్యమంటావ్?" అన్నాడు గురవయ్య

"ఈ బాబున్నాసావ్, కంపెనీ వోళ్ళు- ఇక్కడ ఫాక్టరీ పెడ్తన్నారు."

ఆ బాబు టిప్పుటాపుగా ఉన్నాడు- అతన్చేతిలో ఫైల్సు ఉన్నాయి- కూలింగ్ గ్లాసులున్నాయి ముఖానికి.

"బాబింజనీరు బాబా?" అన్నాడు గురవయ్య.

"అయితేటి, కాప్పోతేనేటి- ఒరే గురవయ్యా చెప్పిందను- నీ పెళ్ళామా పోయింది- ఒంటిపక్షి గాడివి- ఎన్నేళ్ళురా నీకు? బలంగా వున్నావు- పన్జెయ్య గలవు గట్టిగా-"

పోతరాజు మాటల్ను అవతల మనిషి ఆపి, పొదుపుగా కొద్ది మాటల్లో కథ జెప్పేశాడు.

"ఇక్కడ ఫాక్టరీ పెట్టబోతున్నాం- ఫాక్టరీ అంటే బోల్డు జాగా కావాలి- జాగా వున్నవాళ్ళకి కొనుక్కునేందుకు దాని డబ్బూ, కంపెనీలో పనీ ఇస్తాం- మంచి డబ్బు లొస్తాయి."

"ఏదో మట్టి పిసుక్కునే వాళ్ళం, మిల్లు పనులు మాకేటి చేతవుతాయి."

"పని మేం నేర్పుతాం- మీ జాగా అమ్మకం గురించి వచ్చాం" అన్నాడతను- గురవయ్యకి వున్న కొద్దిజాగా కంపెనీవాళ్ళు కొనుక్కున్నారు.

తర్వాత కొంతకాలంకి పెద్ది గోడ నాల్గు పక్కలా లేచింది.

గురవయ్య చాలామందితో కల్సి రాళ్ళు కొట్టాడు- తట్టలు మోసాడు- రాళ్ళ సిమెంటుతో అతికించటం కొద్దికొద్దిగా నేర్చుకొన్నాడు- ఓ సంవత్సరం తర్వాత అక్కడ ఫాక్టరీ బిల్డింగు లేచింది- లారీల్లో ఏవో మిషన్లు వచ్చాయి- అవి చాల బరువుగానూ బండగానూ వున్నాయి- ఎంత బరువుగా వున్నా, "బాబోరె ఇంత మిషనెంత పన్జేస్తదో!"

అని ఆశ్చర్యపోతో దాన్ని మోసారు వాళ్లంతా.

పెద్ద ఇంజనీరు బాబు అరుస్తూనే ఉన్నాడు. "వీళ్లంతా గాడిద వెధవలు- వీటన్నాశనం చెసొదుల్తారు" అని.

ఆఖరికి ఒక మిషను జారి ఒకడి కాలు వేళ్లు తెగనే తెగాయి.

ఎట్లా అయితేనేం అక్కడ ఫ్యాక్టరీ మొదలయింది-

725

గాలిలో పొగ వదిలింది అది- గురువయ్యకి ఫ్యాక్టరీ గొట్టంలో పొగ మాత్రం రోజు కంట బడుతూనే వుంది.

ఫాక్టరీ మొదలయిన మర్నాడు లోపల అడుగు పెట్టబోతే-

గేటు దగ్గిరే అడ్డాడు, జవానులా వున్నాడు- ఖాకీ బట్టల్లో ఖాకీ టోపీ పెట్టుకొని. "కిరీ- కౌన్ హై?" అంటూ

వాడి అరుపుకి హడలి పోయాడు.

తర్వాత తెల్సింది.

మిల్లు పనికి గురువయ్య పనికి రాడట- అంచేత పనొచ్చినోళ్లని టవున్నుంచి తెచ్చారని- కొంతమంది బూవులు అమ్మినోళ్లకి 'దయకొద్దీ' పని అందులో ఇచ్చారని.

"దగా బాబూ" అంటే

"నోర్మూయ్యి- లంజి కొడకా" అని తిట్టాడు పోతరాజు. అతనిప్పుడు ఫాక్టరీకి కాజువల్ లేబర్‌ని సప్లయ్ చేస్తున్నాడు.

అప్పుడొచ్చేడాడు 'ఇశాకపట్నం'

"ఏటో పట్నం వెళ్తే బతుకు మారి పోద్దనుకొంటరందరూ. ఇక్కడంతా ఇసకే. " అనుకొన్నాడు చాలా మార్లు. 'ఏటయ్యా గురువయ్యా నీ ప్రెతాపం' అంతే. "బజార్లో కూలి నాకొడుకునో కాదో కూడా తెలీని కొజ్జాగాడ్ని" అంటాడతను కోపంగా.

"ఒరే గురవయ్యా నీ పేరేంట్రా" అని కొట్టు ఓనరెవరయినా అడిగితే.

"అప్పలాౙిజు బాబూ-" అనాలని- అతనికి తెలుసు.

"ఒరే అప్పలాౙిజా రేపట్నుంచీ నిన్ను సూరిగాణ్ణి కింద మారిస్తే ఎలా వుంటుందిరా?"

అప్పలాౙిజయినా, సూరిగాడయినా, గురవయ్య అయినా పేరుఏదయినా పాతికేళ్ల నుంచీ అతనక్కడే ఉంటున్నాడు. రాంబాబుగారి కొట్టుకి ముందు రాత్రి వేళల్లో ఒక కుక్క పడుకొని వుంటుంది. రాంబాబుగారి కొట్టు అంటే కిళ్లీ కొట్టు కాదు. పెద్ద బజారులో మధ్యలో వుందది. కొట్లన్నీ ఇరుకు ఇరుకు సందుల్లో ఉన్నట్లుంటాయి. వాటిలో కొన్ని అఫీసులయితే కొన్ని సామాను గోదాములు.

రాంబాబుగారి కొట్టు ముందు పడుక్కొనే కుక్క అరవదు కరవదు. కుక్కలు ఎన్నేళ్లు బతుకుతాయో తెలీదుగానీ గురువయ్యకి ఈ కుక్క బతుకు పాతికేళ్ల నుంచీ తప్పటం లేదు.

726

రోజూ అయితే అక్కడ రాత్రిళ్లు కాపలా.

"బాబూ, నాకు బయం బాబూ. దొంగ నా కొట్లకు కత్తులుంటాయి నేకాయలేను" అంటే.

"మిగతా అందరికీ కొమ్ములు మొల్చుకొచ్చాయేంటిరా? తొంగోటానికి జాగా ఇచ్చి తొంగోరా అంటే కథలు చెప్తావు."

తెల్లవారగానే బాబొచ్చే వేళకి కొట్టు తెరవాలి. తర్వాత కొట్టూ, బయటా వూడ్చి శుభ్రం చెయ్యాలి. బాబు టంచనుగా తొమ్మిదింటి కొచ్చేస్తాడు. రాత్రి పదయే దాకా కొట్లో దీపం వెలుగుతూనే వుంటుంది. కొట్టు పక్కనే గోడవునుంది. దాన్నిండా పప్పు బస్తాలూ, పంచదార బస్తాలూ, నెయ్యి డబ్బాలూ, నూనె డబ్బాలూనూ. రాంబాబు కూరగాయల వ్యాపారం చెయ్యడు. అతనికి లారీలున్నాయి.

ఒకోసారి డబ్బట్టుకెళ్ళి బాంకులో ఇచ్చిరావాలి. ఇంకా ఏవో చెక్కులు కూడా ఇచ్చి బాంకుల్లో ఇచ్చిరమ్మంటారు.

అసలు పని ఇంకా వుంది.

లారీలూ, టెంపోలూ, లాగుడు బళ్లూ అయితే బజారులోపలకు రావు. కొన్ని పెద్ద షాపులకయితే అవి రావటానికి వీలుంది. మిగతా వాళ్ల బస్తాలు మోసుకొని వెళ్లాలి

"బాబోరే, ఇవి మనుషులు మొయ్యాల్సిన బరువు కాదురా చిట్టీ. ఇందుల ఎంత బరువుంటుందంటావ్."

"ఉండదంటావా? వందకిలోలు–"

"బాబోరేయ్, మరి గవర్నమెంటు వోళ్ళెందుకురా చూస్తుంటారు– మనం చచ్చిపోంరా?"

చిట్టి ఎందుకో వికృతంగా నవ్వాడు.

"తాతా, ఎందుకు బాధ పడతవ్లే– గుటుక్కున పెద్దరోడ్డులో పీణంవొదిలెయ్" చిట్టి నల్లగా పొడవుగా వుంటాడు– అతనిలో నెమ్మదిగా మాట్లాడే గుణం కన్పించదు– అతనే ఇంకా అన్నాడు:

"పూర్వపు రోజుల్లో తాతా, బానిసలుండేవారుట లే. అంటే వాళ్ళు పశువులన్న మాట– ఎండనక వాననక గాడిదల్లా బరువులు మోసేవారు– పోతుల్లా బళ్ళులాగేవారు– మేనాల్లో మనుషుల్ని మోసేవారు– వాళ్ళందరికీ మనం ఇప్పుడు తిరూలేని వారసులం– ఎరికా?"

ఇట్లాంటి తిరుగులేని వారసులు 10 వేల మంది ఉన్నారు.

దుమ్ము- దుమ్ము.

గాలంతా దుమ్ము దుమ్ముగా వుంది.

గాలిలో చెలరేగుతున్న దుమ్ము మనిషిని కాల్చింతర్వాత ధూళిలా వికృతంగా వుంది.

గురవయ్య పొద్దున్న నుంచీ కదల్నేలేదు.

జనం- రొచ్చు- మధ్యన బస్తాలూ, డబ్బాలూ వేసుకొని వేళ్లేటప్పుడు, అనుకునే వాడు- 'ఈ జనంలోనే చావాలి కాబోలు' అని.

పరిశయంగా కన్పించే మనుషులంటే గురవయ్యకి భయం- ఒకోసారి వాళ్ళందరూ తనని తొక్కుకుంటూ వెళ్ళిపోతున్నట్లు వొణుకు పుట్టేది.

నిన్నటి సాయంత్రం

సంజెవేళ-

అంతంత మంది.

జనం, జనం- జనమే:

అంతమంది జనం గావుకేకలు వేసుకొంటూ పెద్ద వూరేగింపుగా వస్తుంటే అతనికి కళ్ళలో నీళ్ళు వచ్చాయి.

"టవున్లో ఎవళ్ళ కెవళ్ళుంటారు గానీ, మనిషం తరువోత ఓళ్ళకొకళ్ళు అవకే పోతారా- ఈరోజు కాబోతే మరుకో రోజు."

గురవయ్యకి అరిచే ఓపికలేదు- ప్రతిరోజు బస్తాలూ, డబ్బాలూ మోసుకొంటూ ఇరుకు రోడ్లలో కదుల్తున్నాడు గానీ నిజాని కతనికి నడిచే వోపిక కూడా లేదు- పదడుగుల్నుంచీ కన్పిస్తుంటాయి అతని ఎముకలు- పొట్ట లోతుగా లోపలకు వెళ్ళిపోయుంది- అదీ చూట్టానికి చిన్నదిగా కుదించుకుపోయింది- మరంత చిన్న కడుపు నింపుకోటానికి ఈ గాడిద బతుకు బతకాల్సిన కర్మం ఎందుకుపడుతోందో గురవయ్యకి జన్మజన్మలకూ అర్థంకాని వేదాంతంలా వుండిపోయింది;

కాని,

బదుకులో అట్టే కదలికలేని అతని కిప్పుడో పెద్ద అలజడి కలుగుతోంది.

కడుపు కాలి కాలి, మసి అయిపోతుందా?

728

లేకపోతే గాడిద బతుకులు ఈడ్చే మనుషులు ముందుకాళ్ళతో ఏదైనా చేస్తారా?

గురవయ్య తలతిప్పి చూసాడు.

దూరంగా రోడ్డు మలుపు దగ్గిర ఆగిపోయి వున్నాయి.

లారీలూ, ట్రక్కులూ, లాగుడుబళ్ళూ అటూ ఇటూ రెండుపక్కలా రోడ్లచివర్న అవన్నీ అడ్డంగా వుండిపోయాయి– డ్రయివర్లు, క్లీనర్లూ సిగరెట్లూ బీడీల పొగ వదుల్తున్నారు– వాళ్ళు ఇక్కడికి రారు– ఆ ట్రక్కులూ లారీలూ కదలవు– ఇక్కడి బస్తాలూ డబ్బాలూ ఎంతకాలం నిద్రపోతాయో ఎవరికీ తెలీదు.

"లంజికొడుకులకు కొవ్వు ముదిరినాది– నాకపోతే మనం మటుకు పసంసవ్వాల, ఆళ్ళ నవ్వులూ కూకుండాల."

గట్టిగా మాటలు విన్పిస్తే తలతిప్పి చూసాడు.

అప్పల్రాజు గుంపులో వస్తున్నాడు– ఓ పాతిక మంది– అందరూ సల్లగా వికారంగా వున్నారు– వాళ్ళకి ముప్పయ్యేళ్ళ పైన వుంటాయి.

"ఏటి తాతా, కాపేసీవేంటి? దొక్కులు ఎత్తుదామనే?" అన్నాడతను.

"నా కర్మంరా అప్పల్రాజూ–"

"నీ కర్మం కేంలే, తారాజువ్వంటుంది సూడలా– దాని దాబులా పైకెళ్ళి పోతూంది."

"ఏటో, ఆ పెద్దబాబులొచ్చి ఏటి సేస్తారో–"

ఇంకాసేపటికి అక్కడంతా గుంపులు గుంపులు జనం చేరిపోయారు.

పెద్ద వూరేగింపు– ఎర్రజెండాలూ, కేకలూ.

బజారు ముందుకువచ్చి ఆగిపోయారు,

పెద్ద దిమ్మముందు నిలబడి మాట్లాడాడు రంగసామి.

అప్పుడొచ్చాయి, కార్లు మూడు–

జనం అంతా గందరగోళంగా కోపంగా అరిచారు– కొందరు కార్లను గట్టిగా చేతుల్తో గుద్దారు.

కార్లోంచి దిగిన మనుషులు అతి కష్టంమీద జనాలను తోసుకొంటూ బజారు లోపలకు వెళ్ళారు.

729

* * *

లేబర్ సెక్రటరీ విసుగ్గా చూసాడు.

అక్కడ చేరిన వాళ్ళలో తన గురించి ఎక్కువగా ఎవరూ పట్టించుకొన్నట్లు అతనికి అన్పించలేదు- ముందున్న ఫైల్సు వెటకారం చేసినట్లు అన్పించింది.

లా-డిగ్రీ తీసుకొని పైకిపైకి వెళ్ళినట్లు అతనికి ఇంతకాలం తోచింది గానీ ఈ పోస్టులోకి వచ్చింతర్వాత పీకగా తయారయింది.

వందలూ, వేలూ వర్కర్లకీ-కంపెనీలకీ వచ్చే గొడవల్లో తలదూర్చటం అన్నంత బుద్ధి పొరపాటు పని వేరేవుండదని అతనికి పూర్తిగా అర్థం అవుతూనే వుంది కానీ, తప్పటంలేదు- ఎందుకంటే ఇదో పెద్ద ఇనపచట్రం. ఈ చట్రంలో రూల్సూ రెగ్యులేషన్లూ అన్నీ కలవాళ్ళకోసమే తయారయాయి- లేబర్‌కి కలెక్టివ్ బేరం అంటూ ఓ ఆట తయారు చేసారు- బేరాలన్నీ ఆట కు ఈ రూల్సు ప్రకారం ఆడాలి- దాంతో ఆట ఆడితే శకున్తో పాచికలు ఆట్టమే!

ఓ రకంగా అతనికి అమెరికా, బ్రిటన్‌లు నయం అన్పిస్తుంది- బేరాల మధ్య మాట్లాడితే గవర్నమెంటు జోక్యం అంటూ వుండదు- 'మన భారత దేశంలో కార్మిక సంఘాలు ఇంకా బలం పుంజుకోలేదు- అప్పటిదాకా గవర్నమెంటు వాళ్ళకి మాట సాయం రావాలి' అని ఇతర్లు అన్నప్పుడల్లా అతనికి నవ్వొచ్చేది.

"ఇదో దగా, కంపెనీ వాళ్ళకి గవర్నమెంటు సాయం రావటం ఇది" అని అతను అనలేదు.

అక్కడ గదిలో చంద్రశేఖరం, ఇంకొంత మంది బజార్లో షాపులవాళ్ళున్నారు- రంగసామి పక్కన కొంతిమంది యూనియన్ మనుషులున్నారు-

"మూర్తిగారు, అంటే లేబర్ సెక్రటరీ గారు ..." అంటూ చంద్రశేఖరం మొదలుపెట్టాడు.

ఆ తర్వాత వాళ్ళూ వీళ్ళూ చాలాసేపు అటూ, ఇటూ వాదించారు-

"ఇదో వింత గొడవ" అన్నాడు మూర్తి- "మీరు ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ల లోకి రారు- అయినా మా కొంప ముంచుతున్నారు."

"ఇది తగువుకాదు, వీళ్ళకి గొంతెమ్మ కోర్కెలు" అన్నాడు చంద్రశేఖరం.

"ఇక్కడ నుంచి ఏపీ కదలవు మీ కర్మం" అన్నాడు రంగసామి.

నెలరోజుల్నుంచీ చిలికి చిలికి ఇవాళ గాలివానగా మారే సూచన-

పెద్ద బజారు అనబడే పెద్ద మార్కెట్ తెరిచే సూచనలు లేవు-

730

అంటే, లక్షలకొద్దీ ఆదాయం షాపుల వాళ్ళకీ, వేలకొద్ది కూలీలకు తిండి లాంటి పదార్థం దేశంలో చాలా మూలలకు సరుకులూ జీవసమాధిలో ఉంటాయి.

*   *   *

దాదాపు నెలరోజు లయింది—

చంద్రశేఖరంకి ఇష్టంవున్నా లేకపోయినా, అది అందరూ కల్సి నిర్ణయించారు. గొడవలు ఇలాగే వుంటే 'మా యాపారానికి పేడీ' అనీ, 'కూలి నా కొళ్ళే కొవ్వుదిగీదాకా కొట్లు తెరవం గాక తెరవం— లంజికొళ్ళు మాడి సస్తరో, సముద్రిమందల పడి సస్తరో, ఏటి సేస్తారో సెయ్యండి' అనీను— 'అడిగీదానికి నేయం వుండాల— యాపారంగదా లచ్చలుంచి సావ్వా అని వాళ్ళోలోచన.'

పెద్దబజార్లొ కూలీ వెధవల ఆగడాలు మితిమీరి పోయాయని కొట్ల సంఘం పెద్దలు తీర్మానించారు— కొట్ల సంఘం అంటే కిళ్ళీకొట్ల సంఘం కాదు— టవునికి కొద్దిగా దూరంగా వుంటుంది పెద్దబజారు— అందులో ఐదొందలదాకా వున్నాయి కొట్లు.

పంచదార, బియ్యం, పప్పులూ ఉప్పులూ, ఉల్లిపాయలు, బంగాళా దుంపలూ, టామాటాలూ, నూనెలూ, నెయ్యిలూ.

మనిషి బతకటానికి రోజూ కావల్సిన తిండికి సంబంధించిన వస్తువులన్నీ టోకుగా అక్కడ్నుంచి వెళ్తాయి— దేశంలో ప్రిజలు బీద వెధవలయితే కొనుక్కోడానికీ బోల్డు బయటదేశాలున్నాయి— వాటిని తీస్కెళ్ళటానికి సముద్రం నిండా పడవలున్నాయి— కొట్లసంఘం వీటన్నింటిని నడుపుతుంది. (అంటే పడవల్నికాదు. సరుకుల్ని) రోజూ ఎంతలేదన్నా ఓ ఎనభై లక్షల రూపాయలు గిర్రున తిరుగుతాయి. వాటితోపాటు— లారీలూ, ట్రక్కులూ, లాగుడుబళ్లూ, వాటిని తోలుతూ లాగుతూ మనిషి జన్మఎత్తిన శవాలూనూ, బస్తాలూ, డబ్బాలూ లారిల్లోంచి దింపటానికీ ఎత్తటానికీ ఓ పదివేలమంది కూలీలు.

వాళ్ళలో చాలమంది వాళ్ళ తాత ముత్తాతల దగ్గిర్నుంచీ ఈ బజార్లోనే బరువులు ఎత్తుతున్నారు.

అయ్యా! పనివాడంటే ఎవడు?

(పనిచేసే వాడే పనివాడు)

'వర్క్‌మెన్' అనగా వాడికి జీతం కరువు భత్యాలూ, శెలవలూ, జబ్బులొస్తే ఖర్చులూ ముసిలోడయితే తర్వాతా, వీటన్నిటికీ అండగా నిలకడగా పనీ ఉండాలి.

731

ఎంత మాట !

'కూలి వెధవలకు పెతిదీ ఇచ్చుకొంటూ కూర్చుంటే మా చేతికి చిప్ప వస్తుంది' అని కొట్ల సంఘం పెద్దలకు నిక్కచ్చిగా తెల్సు- అందుకే యాభై ఏళ్ళుగా పన్జేసే ముసిలాడికయినా వాళ్ళ కొట్లలో పన్జేసేవాడిగా గుర్తింపులేదు.

'ఆళ్ళ సొంత పను లాళ్ళు సేసుకొంటున్నారు- సామాను కొనేవాడు 'అబ్బీ కొద్దిగా సామాను లారీలో పడెయ్' అంటే పడేస్తున్నారు- వాళ్ళో పావలా ఇస్తున్నారు- మాకు సామానుతెస్తే మేవో పావలా ఇస్తున్నాం- ఆళ్ళు మా పనోళ్ళెలా అవుతారు?'

గాంగుల్లో ఉండీ మనుషులు కూలీలు-

ఓ జట్టు.

నిజానికి ఏళ్ళకొద్దీ వాళ్ళు ఓ కొట్టుదగ్గిరే బరువులు ఎత్తుతూ ఉంటారు- పోర్టర్లు రైల్వే స్టేషనుల్లో ఉంటే, వీళ్ళు రోడ్లమీద ఉంటారు.

అంతేకాదు-

గురవయ్యవనీ అప్పల్రాజువనీ చెయ్యాల్సిన పనులు చాలా వున్నాయి.

బజారుకు కొంచెం దూరంలో ఉన్నాయి బాంకులు- వారికి డబ్బూ, డబ్బుతో సమానం చెక్కులూ పట్టుకెళ్ళాలి.

గుర్ఖా అంటే ఓ ఖాకీ యూనిఫారం నెత్తిన ఓ టోపీ, తుపాకో కత్తో వుంటుంది. వాళ్ళు కాపలాదార్లు అయితే గురవయ్యలూ, అప్పల్రాజులూ కాపలా కుక్కలు.

రాత్రయితే-

ఊరులో భయం ఉన్నా లేకపోయినా, ఖరీదయిన సరుకులుంటే ప్రమాదమే.

- నాలుగేళ్ళ క్రితం కాబోలు సివంచలం చచ్చిపోయాడు- చచ్చిపొయ్యాడంటే పేదవాడికి గుండెపోటు లాంటి ఖరీదయిన జబ్బురాలేదు- సివంచలంకి ఇరవై ఆరేళ్ళే. అతనూ ఇలానే కాపలా కుక్కగా వుంటే, కుక్కలంటే పడనిదీ గాంగొచ్చి పడింది- వాళ్ళ చేతుల్లో చిన్నచిన్న తుపాకులు కూడా వున్నాయి.

గోడవునుల్లో సామానులు తీసికెళ్ళాలంటే (అక్రమంగా)-

(సొమ్ములున్న బాబులు ఎర్రి వెధవలు కాదు)

కొంత దెబ్బలాట తప్పదు- అట్లాంటి గొడవల్లో సివంచలం చచ్చిపొయ్యాడు- బాబుగారి సొమ్ము మిగిలిందా, లేక దొబ్బుకు పోయాడా అంటే తుపాకుల గుండాలు మహరాజుల్లా పట్టుకుపొయ్యారు.

732

ఇండస్ట్రియల్ డిస్ప్యూటు యాక్టులూ– కాంపెన్సేషన్ (వర్క్‌మన్‌లకి) యాక్టులూ ఉన్నవి అనామకుల కోసం కాదు– నిపంచలం వర్కరు అంటానికి దాఖిలాలు ఎక్కడా లేవు– ఒకవేళ ఉన్నా అతనికి 'నా' 'నీ' అన్నవాళ్ళు లేరు.

ఒకవేళ ఉంటే– వాళ్ళు ఏడుస్తూ కూర్చోటానికి వీలు అవ్వేలేదు. ఎందుకంటే–
– మళ్ళీ తెల్లవారగానే

గోడవునులు తెరవాలి– నేల చిమ్మాలి– దుమ్ము తుడవాలి ఆఫీసు టేబుళ్ళమీద. మళ్ళీ పది దాటింతర్వాత బాంకులకు వెళ్ళాల్సి వస్తుంది.

ఈలోగా ఎండ పెరుగుతుంది.

బజారు నుంచి హార్బరుకీ, రైల్వే బోగిలుండే యార్డులకీ ఇంకా చాల మంది యాపారం చేసుకొనే వారి గోడవున్లకీ గొప్ప గొప్ప రహదార్లు లేకపోయినా, బురద రోడ్లూ– అక్కడక్కడా కంకర– తారు ఉన్నవీ ఉన్నాయి. చిన్న చిన్న సరుకులకి (అంటే) నాలుగయిదు బస్తాలూ డొక్కులూ మోసుకెళ్ళటానికి లారీలు, ట్రక్కులూ గిట్టుబాటు కావన్నది ఎవరికయినా తెలుస్తుంది– ఆ రోడ్లనిండా లాగుడు బళ్ళూ, కార్లూ, రిక్షాలూ, ట్రక్కులూ అన్నీ వెళ్తూనే ఉంటాయి– వెళ్ళలేనిది మనుషులు మాత్రమే.

వీటన్నింటి మధ్య సత్తువలేని గాడిదలు కొన్ని మనిషిరూపం వేసుకొని వెళ్తూ వుంటాయి– వాటితో వాతావరణం అంతా పాడయిపోతున్నట్లు కొందరు మర్యాదస్తులు నిత్యం అనుకొంటూనే ఉంటారు

– నాలుగేళ్ళ క్రితమే పైడికొండ చచ్చిపోయాడు.

ఆరోజు వానపడింది– వూరంతా బురదయి పోయింది– రోడ్లన్నీ సగం నీటి పాలయ్యాయి.

పైడికొండ నీళ్ళల్లోనూ, బురదలోనూ యీడ్చుకొంటూ నడుస్తూ ఉంటే, అతని మోకాలి చిప్పలు కనపడటం లేదు– అతని వీపునుంచీ పైభాగం ఎప్పుడూ కనబడదు– దానిమీద ఎప్పుడూ ఓ పెద్ద పంచదార బస్తా వుంటుంది– పంచదార తియ్యగానే ఉంటుంది– అయితే పైడికొండలాంటి వాళ్ళు ప్రాణంమీద తీపి ఎప్పుడో వదిలేసుకొనే ఉంటారు– మహానగరాల్లో మనుషులు పురుగుల్లా బతుకుతుంటారు– పురుగులు ఎప్పుడో ఎవరి కాలికిందో నలిగిపోతాయి– పంచదార బస్తా నూరు కిలోల బరువూ భూమి ఆకర్షణకి దగ్గిరవుదామని తీవ్రప్రయత్నం చేస్తుంటే, పైడికొండ వళ్ళంతా అటు భూమినీ, ఇటు వీపుమీదున్న తీపి మూటనీ కూడా ఎదిరించాలని విఫల ప్రయత్నం చేస్తోంది.

733

భూమే గెల్చింది— భూతల్లికి ఎన్నో అండలు.

బురదా, ఎదురుగా వస్తున్న లారీ, అక్కడే ఉన్న గొయ్యి, అది కనబడకుండా నీళ్ళు— రంగు నీళ్ళలో కాలుజారిన పైడికొండకు లారీ క్రింద తన రక్తం పారుతుందని తెలీలేదు.

ప్రపంచంలో ఎవరికయినా 'క్వింటాలు బరువు' మనిషి మొయ్యాల్సిన బరువు కాదని తెలుస్తుంది— నాగరికత అంటూ ఉన్నచోట్ల అక్కడి సభ్యులకి అట్లాంటి నరకం ఉండకూడదనీ తెలుస్తుంది— కానయితే వారు సభ్యులా అని ఇతర్లు ప్రశ్నించవచ్చు— ప్రశ్నించారు.

అందుకే పైడికొండ చచ్చిపోయాడు.

పైడికొండడే కాకుండా ఇంకా ఇరవైమంది బస్తాల బరువు క్రింద చచ్చిపోయారు.

"బరువులు నిర్ణయించటం మా చేతుల్లోలేవు మేం ఏంచేస్తాం?" బజారుపెద్దలు.

"కనీసం మనుషులచేత వాటిని మోయించటం మానొచ్చుగా?"— అనామకులు.

"సరే, ఇంక వాళ్ళు బతుకు కూడు కూడా లేక చస్తారని!" బజారుపెద్దల దయ; నాలుగేళ్ళ నుంచీ ఈ గొడవలు ఇలా వుంటూనే ఉన్నాయి.

* * *

పదేళ్ళ క్రితం వచ్చేసింది నీలమ్మ—

నీలమ్మ అంతకు ముందు పట్నం చూళ్ళేదు— పల్లెటూర్లో ఉంది— చిట్టితో పెళ్ళవగానే బస్తీకి వచ్చేసింది— బస్తీ అంటే పెద్ద పట్నం అనుకొనేది నీలమ్మ— అక్కడ సముద్రమూ, రంగురంగుల మనుషులూ, ఎత్తు ఎత్తు ఇళ్ళు, ఎన్నో రకాల తినే వస్తువులూ ఉంటాయని కలల్లో కాకపోయినా పగలే అనుకొనేది.

బస్తీ అంటే గుడిసెల గుంపని అప్పుడే తెల్సింది నీలమ్మకి.

చాలాకాలం వరకూ ఈ బస్తీ బతుకు అర్థంకాలేదు నీలమ్మకి— మొదట్లో పుష్టిగానే వుండేది ఆరోగ్యం.

చిట్టి మాట పెళుసు— 'మనసు మంచిదే' అంటుంది నీలమ్మ. బజార్లో 'కూలీ పనా?' అనుకొంది— కొద్దిగా బాధ పడింది.

'చిట్టిగాడికేం బోనసూ వస్తుంది' అన్నారు పక్కల్నుండే వాళ్ళు— బోనసంటే ఏమిటో నీలమ్మకి తెలియదు— పక్కల్నుండే గుడిసెల్లో ఆడవాళ్ళు తక్కువమంది— అక్కడ ఐదారొందలు గుడిసెలు కొద్దిగా పల్లంలోకి ఉన్నాయి— నీలమ్మ ఉండే గుడిసె

మరీ పెద్దది కాకపోయినా గౌరమ్మా, చిన్నల్లీ, నూకాలూ వాళ్ళ మొగుళ్ళూ కూడా అందులోనే ఉంటారు– వాళ్ళెవరూ చిట్టికి బంధువులూ కారు.

కొత్తలో, 'ఇంత మందిలో తొంగోటం ఎలా?' అనుకొంది– ఆ తర్వాత కొందరు గుడిసెబయటా, కొందరు లోపలా, అడ్డంగా ఆరేసిన గుడ్డలూ– అలవాటయి పోయింది నీలమ్మకి– ఇప్పుడు నీలమ్మకి ఆరేళ్ళ గుంటడూ, ఏడాది పిల్లాసూ– ఆ పిల్ల ఇప్పటికీ పాలకోసం నీలమ్మని ఏడిపిస్తూనే ఉంటుంది.

"ఏటుంటుందే ముదనష్టపు ముండా"– అని తిడ్తూంటుంది.

తిట్టినా తిట్టకపోయినా వచ్చే ఒక్కబొట్టయినా పసికూన తాగకపోతే నీలమ్మకి రక్తంలాగేసి గుండెలు పీకేసినట్లు నొప్పివస్తుంది.

రాత్రయితే, పొయ్యి, గుడిసె బయట. అందరుపొయ్యిలూ చీకట్లో పొగకన్పించక పోయినా దగ్గూకళ్లమంటా. వండేది ఎక్కువలేకపోయినా– పదిమందికి ఓకుండచాలక పోయినా వంతులవారిగా,

పగలయితే

రాళ్లకొట్టటం. సున్నంకలపటం. నీలమ్మ కాళ్లపొక్కటంకూడా మానేసాయి. ఇరవై ముప్పై గుడిసెలమధ్య ఉంటే ఒకచిన్న పంపుంటుంది. దాంట్లో నీళ్ళకోసం కొట్లాటలు.

వానొస్తే– గుడిసెలన్నీ నీటిమయమే. ఇంకాగుడిసెలకి ఓచివరగావెళ్తే నాసి రకంబియ్యం, పనికిరాని కూరలూవేసుకొని అమ్ముతుంటారు గుడిసెల్లోవాళ్లే. వాళ్ళకే. (స్వయంసమృద్ధి)

ఇటుపక్కగా కాలవో, చెరువోతెలీని నీళ్ళగొయ్యి– పదిగుడిసెలపాటి. దాన్లోనే మనుషులు స్నానంచేస్తుంటారు. బట్టలు ఉతుకుతుంటారు. ఈత వచ్చినవాళ్ళు ఈదుతూ చివరిదాకా పోతుంటారు. తిండితినే పళ్ళేలూ, వండేగిన్నెలూ అందులోనే కడుగు తుంటారు.

పదిహేను ఇరవైగుడిసెలకి ఒకటుంటుంది– ఓఇటికల షెడ్డులాంటిది. అది వాళ్ళకి మరుగుస్థలం. కూర్చునేవలక– దానికిఓకన్నం– క్రింద ఓపెద్ద తొట్టిలాంటిది. మామూలుగా అయితే కార్పొరేషన్ వాళ్లోఎవళ్ళో ఊడ్చేవాళ్ళువచ్చి రెండురోజుల కొసారి దాన్నిశుభ్రంచెయ్యాలి– ఈవూళ్ళో అలాంటివి జరగటంమానేసి చాలా ఏళ్ళ యింది ఒకోసారి వారాలు గడిచిపోతుంటాయి.

735

ఈలోగా నేలంతా మరుగుమయం.

వాటిమీద ఈగలూ— దోమలూ.

జుగుప్స ఒక్కటేఅయితే బాధపడాల్సింది అట్టేలేదు— కలరా, మశూచీ— క్షయా ఇంకా జీర్ణవాయువులకు సంబంధించిన చాలాజబ్బులూ ప్రారంభం అవుతుంటాయి.

బస్తీలో ఇట్లాంటివాటితో ఎంత మందిచచ్చిపోయారో వాళ్ళకేతెలీదు— దూరంగా ఫాక్టరీలపొగా, దుమ్మూ— కలుషితం అంతా మనుషుల్ని జబ్బులకు బానిసలుగా చేస్తుంటాయి.

ఊపిరితిత్తుల్లో క్షయపెట్టుకొని ఎంతోమంది బరువులు మోస్తూనేఉన్నారు— బరువులకింద కూలుతూనే ఉన్నారు.

బిజినెస్ ఆట్టేలేనిరోజుల్లో—

బజారులో గోడవునుముందే—

గూనప్పారావుకీవుంది క్షయ— అతనుమనిషి సలభయ్యేగానీ అరవైలావుంటాడు; సన్నగా ఎముకలుపోగులా, బస్తాలతొందరమీద మనిషి పొరపాటుగా బస్తాఎత్తుకొన్న అప్పారావుమీద ఇంకోబస్తాపెట్టేశాడు— అప్పారావు మెడ విరిగిపోయి చచ్చిపోయాడు.

దాంతోగొడవ మొదలయింది.

పీనుగుల్లా వున్నవాళ్ళందరూ పనికిరారనీ అదీకాక యాపారం పనీలేదు కాబట్టి మనుషులు అక్కర్లేదనీ మూడువందల మందిని పొమ్మన్నారు.

ఎప్పట్నుంచో అడుగుతున్నారు—

సంవత్సరాని కోసారి వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా ఉంటాయని కొద్దిపాటుడబ్బు బోనస్ఇవ్వాలని— (పర్మనెంటు వాళ్ళకితప్పిస్తే మిగతావాళ్ళకి ఇట్లాంటివిఉండవు— కొద్ది మందికిచ్చారు— మిగతావాళ్లు మొండికేశారు.)

దాంతో చిలికిచిలికి గాలివానయింది.

దాదాపు ఓవెయ్యిమందిఉన్న యూనియన్ బోనస్గురించీ, తీసేసిన వాళ్ళ గురించీ బరువులగురించీ అల్లరిచేస్తే—

ఈగోల మేంభరింలేం— అన్నారు పెద్దబజారుటనర్లు.

అనటంకాదు— గోడవుస్లూ, కొట్లూ మూసేసారు.

దాంతోఆకలీ కరువూమొదలు.

736

* * *

దీపావళి.

వూర్లోని పెద్దపెద్దమేడలూ, భవంతులూ అమావాస్యచీకట్లో మెరుస్తున్నాయి.

బస్తీలోంచిచూస్తే తారాజువ్వలూ అవీఆకాశంలో కన్పించి క్రిందపడి గుడిశెల్ని కాల్చేస్తాయోమోనన్నట్లున్నాయి.

మామూలుగా చీకట్లో వంటపొయ్యిలమంటే వెలుగ్గా వుండేది- ఇప్పుడుఅదీలేదు.

మనుషులకి చీకట్లో కళ్లమంటలుగా అన్పించాయి.

పండగకోసం కాకపోయినా వాళ్ళకి గుండెమండింది.

*   *   *

రామారావుకి బుర్రంతా పిచ్చెక్కినట్లుంది-

వచ్చే జీతం సొమ్ములు నెలకి సరిగ్గా చాలి చావటం లేదు- దానికితోడు నెల రోజుల్నుంచీ వూర్లో అన్ని రేట్లు పెరిగిపోయాయి.

"మమ్మల్ని చంపుకు తినటం ఎందుకు- మూటలు కట్టుకొని ఉన్నాం అనా?" అనడిగితే-

"వాళ్ళను (పెద్దబజారు వాళ్ళని) అడక్కూడదూ? కొట్లన్నీ మూసుక్కూర్చుంటే మాకు ఎక్కణ్నుంచి వస్తాయి మాష్టారూ?" అన్నాడు కొట్టువాడు.

ఈ గొడవలోనే పెళ్ళి తంతొకటి.

తమ్ముడి పెళ్ళి ఇంత అనవసరమయిన తంటా అవుతుందని అతనెన్నడూ అనుకోలేదు- నానా బాధలూపడీ పక్క వూర్నించి, సొంతూరునుంచీ కొన్ని తెప్పించాడు.

ఇప్పుడు కొంప మునిగిపోయినంత పనయింది- ఉన్న నెయ్యి అంతా అయిపోయింది- 'ఖర్మ!' అనుకొన్నాడతను.

పనికట్టుకోని వెళ్ళి కొట్టువాడి పీకలమీద కూర్చున్నాడు.

"లాభంలేదు మాష్టారూ! మేం ఏంచేస్తాం చెప్పండి."

"ఏదో ఒకటి చెయ్యవయ్యా బాబూ, పోనీ ఎక్కడన్నా పొరపాటున దొరుకుతుందేమో చెప్పు- నేనే తెచ్చుకొంటాను."

"అదీ నమ్మకంలేదు- రిస్కనుకోండి- తిన్నగా బజారుకే వెళ్ళకూడదూ? వాళ్ళ మూటలు మొయ్యటం చేదనుకొండి- మీరంతట మీరే కొనుక్కొంటే వాళ్ళ ఇస్తారేమో చూడండి.

అదే చేసాడు రామారావు.

అతనింటికి ఐదు మైళ్ళ దూరంలో వుంది బజారు- అతనక్కడికి వెళ్ళేసరికి అక్కడంతా గోలగోలగా వుంది- ఆఖరికి ఓ చిన్న గోడవున్లో సంపాదించాడు రెండు డబ్బాలు నెయ్యి- "పీడ వదిలింది" అనుకొంటూ బయట అడుగుపెట్టాడతను.

* * *

"గురూగారు దంచేసారు" అన్నాడు అప్పారావు- "మీటింగులో వాళ్ళంతా దంగయిపోతేనూ...." రంగసామి పొంగాడు.

అతను తాగేసిన టీ కప్పు టేబులుమీద పెడుతూ, "కానేటి లాబం? మీటింగు గుడ్డు గుడిసి పోయింది గదా, కొట్లు మూసుక్కూచుంటే యీళ్ళంత మా సంకలు నాకాల్న" అన్నాడు

"ఏటి గురూగారు అంతమాటనేస్తే వొల్లగాదు- రంగసామిగారున్నారంటే తేల్చీవాలి యిషయం- ఏటెన్నిమార్లు రేట్లుపెంచారు? ఏటి, ఇంతకుముందిలాగే సొమ్ము ల్లేవోఅని ఏడ్చేసిన నాయాళ్ళంతా యీడాఏకోపాలి మూడుసార్లు అందరికీ వందవంద కక్కలేదూ?" అన్నాడు అప్పారావు.

గదిలో ఇంకాచాలా మందున్నారు.

బజారులోనే ఓచిన్నరూము యూనియన్‌కి తీసుకున్నారు- అందులో కూర్చుంటాడు రంగసామి- యూనియన్‌కి అతను ప్రెసిడెంటు- ఇంకా చాలమంది ఉన్నారు గానీ రాంగసామిచెప్పింది వాళ్ళకువేదం.

యూనియన్‌లో ఉన్నది వెయ్యికి కొంచెంమంది ఎక్కువగా అరవయ్యో దెబ్బయ్యోను- కాకపోతే మిగతా వాళ్ళందరూకూడా యూనియన్ చెప్పినట్లేవింటారు- ఎందుకంటే అక్కడ జరిగేవన్నీ యూనియన్‌కి పెద్దబజారు ఓనర్లకీమధ్య ఒప్పందాలవల్లే జరుగుతాయి.

రంగసామి పైజమా, లాల్చీ వేసుకొనిఉన్నాడు. అతనికి నలభై ఐదేళ్లుంటాయి. మనిషి ఆరోగ్యంగా ఉంటాడు- చేతిలో ఎప్పుడూ సిగరెట్టు వెలుగుతూనే ఉంటుంది.

"రంగసామి గాడికి కలేజా వుంది" అని బజారు ఓనర్లు అప్పుడప్పుడూ అంటుంటారు.

"నా జోలికొచ్చి యూసికాలేస్తే, నా దమ్ము లేటో తెల్సిపోతుంది" అన్నాడు రంగసామి- "కొట్లు మూసేసుకొని కూర్చుంటే వెధవలు తిండిలేక సస్తారని ప్లాను

గాబోల్ను- కొట్లు ఇరగదీసి ఉన్నకాడికి దొబ్బుకెళ్తే సరి" అన్నాడు- ఆ పని జరిగేది కాదని అతనికీ తెల్సు- కాకపోతే అలాగ మాట్లాడకపోతే జనాలు వెనక ఉండరని.

"అయితే ఏటి సేస్తారు? కొట్లన్ని తెరవం గాక తెరవం అన్నారాళ్ళు- మనం ఏంజేస్తే ఏటవుతుంది?" అన్నాడు చిట్టి. అతని పక్కనే అప్పల్రాజున్నాడు- ఇంకా చిట్టితో ఉండేవాళ్ళు ముగ్గురు నలుగురున్నారు- గదిలో అంతా కల్సి ఓ పదిహేను మందిదాకా ఉన్నారు.

"దానికేటయినా ఆలోసించాల- అయినా ఇదన్యాయం- ఓ పక్క రేట్లు మంట లల్లే అంటుకుపోతుంటే, మనుషులు తిసేవన్ని తాళమేసి దాచీటం మజాకా కాదు- అదేంటి- దీని గొడవ నిమిషంలో కుదిరిపోతుంది- దీని బాబులాంటి గొడవలున్నాయి మనకి- అవి తేల్చుసుకొంటే, నాకు సగం బారం తగ్గిపోద్ది" అన్నాడు రంగసామి.

రంగసామి కంత మొయ్యలేని భారాలు ఏం వున్నాయో అక్కడున్న మిగతా వాళ్ళకి తెలియలేదు- రంగసామే అన్నాడు;

"ఇప్పుడిషయం ఏంటంటే, మీటింగులో బాణం గురి ఎందుకు తప్పిందా అని ఆలోసించాల- మనం అడిగేవన్ని అత్యాసలంటున్నారు- దీనికేదో లొసుగుండిఉండాల. లాపోతే లేబర్ శెక్రట్రీ ఏటి, రాడమేటి? అటు ఆళ్ళకీ సెప్పలేకపోనాడంటే మన్లో స్టాంగుండాలన్నమాట- ఇటు మన గొడవ తేల్చలేకపోయాడంటే ఏదో ఉంది-" రంగసామి మనుషుల ముఖాల్లోకి చూశాడు.

"ఏటి లొసుగు! మనుషులు సవ్వరాదంటే లొసుగా, సొమ్ములివ్వండి బత కాలంటే లొసుగా, మనుషులకు పనీండి అని మరియాదగా అడిగితే లొసుగా" విసురుగా అన్నాడు చిట్టి- అందుకే చిట్టి అంటే చిరాకు పడ్తాడు రంగసామి. 'దూకుడు' దూకుడు పన్చియదు గురూ' అంటాడు రంగసామి.

"ఏటింతసేపూ టాపెగిరీలా ఎగిరిపోడమేనా, కొంత బుర్రెట్టి ఆలోసించాల్రా అని సూట్టం లేదేమ్కటి- ఏటి యూనియన్ జనాలం వెయ్యిమందయితే, పదేలు అంతా కల్సి. ఏటి మనం సెప్పింది ఆళ్ళు ఇంటారా లేదా అని సూడాలా వద్దా?"

"ఇయాళ ఆళ్ళు మనాళ్ళు కాదేటన్న సింత పట్టిందేటి? అయినా ఏటి యూని యనో ఆళ్ళందరూ కాజుయల్ అని ఆ నాకొళ్ళు దగాసేస్తుంటే బొమ్మలా నిలబడి పోయింది."

739

‘చిట్టీ.’ అన్నాడు రంగసామి గట్టిగా. అతనికి చిట్టిమీద మెల్లిమెల్లిగా కోపం పెరిగిపోయింది– ఈమధ్య కొద్దికాలంగా చూస్తున్నాడు రంగసామి– చిట్టి రోజురోజుకీ అడ్డదిడ్డంగా తయారవుతున్నాడని అతని అభిప్రాయం.

“ఏటి? ఉన్నమాటంటే మసయీలా సుత్తావేం?” అన్నాడు చిట్టి– అతను లేవబోతే అప్పల్రాజు కూర్చోబెట్టాడు.

“చిట్టి నీకందుకీ అంటను, ఆలోసించాల్రా అని– గవర్నమెంటోడు వచ్చి ఏటీ చెప్పనేదంటే ఏటన్నమాట– నే సెప్తాను నువ్వినూ– అలాగ ఎగిరిపోకు–

ఆళ్ళేటంటారంటే ఓసూట్ల బరూలుకి మేం ఏంచేస్తాం అంటారు– మరి రూలు పరికారం ఉన్న బరువులు వీళ్ళు మార్చలేరుగదా? అందుకేటంటానంటే మరంత బరూ అయితే కూలి రేటయినా పెంచొచ్చుగా అని– గవర్నమెంటోళ్ళకి బరువులు మార్చండని రాస్తాం అంటారు గాని రేటు పెంచమ్రనే– అదీ నాకు మంట– ఇకపోతే,

బోనసంటాం– అదియాల కాబోతే రేపిస్తావంటారు– కాబోతే పదివేలమందికీ ఎందుకిస్తాం అంటారు– పదీ వేలమందికీ యీయండని మనం అడిగామా– ఒరే అబ్బీ నీ యూనియన్ కానోళ్ళకి ఇమ్మనంటున్నావు గదా, రేపాళ్ళేదయినా మాగ్గొడవలు తెచ్చిపెడితే నువ్ ఆరుస్తావా తీరుస్తావా అంటారు– అసలీళ్ళకి బోనస్ ఏంటి, రోజుకో చోట పన్జేసుకొనీవాళ్ళకి అంటారు– అల్లాటప్పాగా కొట్టీటంగాదు– నాకు తిక్కరేగిందా కోరుటు కెళ్ళితీర్తాను అది యేరే సంగతి– కానయితే కోర్టు కెళ్ళితే గెలుస్తామా అని సూడాల– కోర్టుకెళ్ళి లేబరోళ్ళ యూనియన్ పోయిందంటే ‘సీ’ అంటారు మనోళ్ళే– రేపీళ్ళు అదీపనిగా కొట్లు తెరవం అంటే కోర్టువాళ్ళు తెరిపించీస్తారు– మనం ఏట్ సేసాం అని కొట్లు మూసీవాలి? గొడవలయ్యాయంటే అవలా అవుతూనే వుంటాయి.

అదికాక తీసేసినోళ్ళను వెయ్యండ్రా అని కేసెట్టాలా అంటే దానికీ రూల్సుంటాయి గదా? ఆ నాకొళ్ళు బుర్రలేని నాకొళ్ళా, వారానికోసారీ, పదిరోజులకోసారీ జనం పేర్లు మార్చిపారేస్తుంటే, ఏటని కేసెట్టాం ఏటి పర్మనెంటు సెయ్యమంటాం?

రేటు పెంచి, యూనియన్ వాళ్ళకిమాత్తరం బోనస్ అంటే కుదుర్తుంది– అదే సూత్తన్నాను– ఏటి సెయ్యమంటారు?” రంగసామి ముగించాడు.

“దంచీసారు గురూగారూ” అన్నాడు అప్పారావు.

చిట్టి మళ్ళి చిరాగ్గా చూసాడు–

“అదన్నేయం– మందకి నోరులేదుగదాని గాలికొగ్గీటం” అన్నాడు.

740

"ఆశ్శేటి ఎండినాకులేంటి గాలికెగిరి పోటానికి ?" రంగసామి విచిత్రంగా నవ్వాడు– "అయినా యూనియన్ కేటిమంచి, ఏది పెద్దన్నది నాకొగ్గియండి, యూనియన్‌కి ఫలానాది సామూలకంగా జరగలేదూ అనీయండి, ఈ సిగరెట్టు మానీస్తాను" రంగసామి సిగరెట్ కాలికింద పడేసి నొక్కి, ఇంకో సిగరెట్టు తీసాడు– అతనింకా ఏదో అంటూఉండేలోగా–

"పట్టుకో పట్టుకో" అని గట్టిగా అరుపులు విన్పించాయి– మనుషులు పరిగెట్టడం– గోలగోల.

దబ్బుమని చప్పుడయింది రూములో.

అంతకన్న ఎక్కువ చప్పుడుతో టేబులుమీద రెండు డబ్బాలు పడ్డాయి.

అది టేబులుమీద పడేసినతను చెమటతో తడిసిపోయిఉన్నాడు– చేతులకు మట్టి అంటుకు పోయివుంది– నేలమీద పడినట్లున్నాడు కాళ్ళు కొట్టుకుపోయి మోకాలి దగ్గిర రక్తం కారుతోంది.

అతని వెనకే ఓ మనిషి పరిగెత్తుకొంటూ లోపలకు వచ్చాడు.

వెనకాలే కొట్లవాళ్ళు కొంతమంది పరిగెత్తుకొంటూ వచ్చారు– అతను డబ్బాలు టేబుల్‌మీద పడెయ్యగానే ఓ నలుగురు అతని పట్టుకు గుంజారు– ఒక్క దెబ్బతో రూము బయటకు లాక్కుపోయారు వాళ్ళు.

"అరె, అరె, ఏంటిది–" అన్నాడు రంగసామి. అతనికి ఏం జరిగిందో అర్థంకాలేదు– చిట్టి గబుక్కున లేచి బయటకు వెళ్ళిపోయాడు.

వాళ్ళు అతన్ని పట్టుకొని చేత్తో కొట్టబోతుంటే అడ్డంగా వెళ్ళాడు.

"ఏటయింది–" అనరిచాడు.

"దొంగ నాకొడుకు– డబ్బాల్దొబ్బుకెళ్ళామనే– వెంటపడితే ఇందులో దూర్తున్నాడు" అన్నాడొకతను.

ఇంతలో రామారావు మధ్యలోకి వచ్చి "పోన్లెండి, వొదిలెయ్యండి అతన్ని ఎందుకు గొడవ ?" అన్నాడు.

ఇంగాక రామారావు నెయ్యి డబ్బాలు కొనుక్కొని బయటకు రాగానే అక్కడ గుంపు మనుషులు ఉన్నారు– వాళ్ళంతా కింద కూర్చునీ, కొంతమంది నిలబడీ కొట్టుకొంటున్నట్లు మాట్లాడుకొంటున్నారు– అతను బయటకు రాగానే, ఎవరో ఏదో అరిచారు– కొనుక్కెళ్ళడం కుదరదన్నారు ఎవరో– పట్టించుకోనట్లు వచ్చేస్తుంటే చేతుల్లోవి

741

ఎవరో లాక్కొని పరిగెత్తారు— కొట్లవాళ్ళు, కొందరు అక్కడే వుంటే చూసి పరిగెత్తారు— వాళ్ళ వెనకే కూలీవాళ్ళు పరిగెత్తారు— అదీ జరిగింది.

"మాకయితే కొట్లు మూసీసాం అంటారు— మీకయితే సొమ్ములకమ్ముకుంటన్రు" వగరుస్తూ— ఆ డబ్బాలు ఎత్తుకొచ్చినతను.

అంతలో వెనకాల పరిగెత్తుకొంటూ వచ్చారు పోలీసోళ్ళు.

"దొంగతనం" అంటూ అతన్ని తీసికెళ్ళారు.

తర్వాత అక్కడ రంగసామికీ, చిట్టికీ ఇంకా కొంతమందికీ గొడవ అయింది.

"సామాన్లెవడయినా కొనుక్కుంటే, లాక్కోమన్లేదే— అయినా అడు యూనియన్లో అయినా లేడు ఏంసెయ్యను; అయినా వాణ్ణి వొగ్గిసీలా చేసే పూచీ నాది" అన్నాడు.

* * *

పదేళ్ళ క్రితం—

కొంతకాలం రంగసామి బస్తాలు మోసాడు, పేకీజీ చెక్కలు ఎత్తాడు— లారీల్లో సామానులు దించాడు— అప్పట్లో మనుషులు అంత ఎక్కువగా లేరు— బజారు ఇవాళంత పెద్దదీకాదు— అందరూ కలిపి ఓ పదిహేను వందల మంది కూలీలు ఉండేవాళ్ళు.

బస్తీలో ఉండేవాడు గానీ అతనికి బస్తీ వదిలి కొద్దిగా అవతలవున్న పెంకుటిళ్ళలోకి మారి కొంత జీవితం బాగుపర్చుకోవాలని ఉండేది— జీవితాలు బాగుపర్చుకోవాలంటే అట్లాంటివి కూలివాళ్ళ చేతుల్లో ఉండవని అతనికీ తెల్సు.

ఓ కూలిమనిషి పెళ్ళాంతో ఓ కొట్టు ఓనరు బావమరిది కొంచెం వెర్రివేషాలు వెయ్యగా, ఉన్న కూలీలు రెచ్చిపోయారు— గొడవ ఉద్రిక్తం అయేసరికి రంగసామి కలుగజేసుకొన్నాడు— మిగతావాళ్ళతోపాటు అతనూ రెచ్చిపోయాడు— అప్పుడయిన కొద్దిపాటి కొట్లాటల్ని సమర్థవంతంగా ఎదుర్కొనేసరికి జనాలకి అతనిమీద ఓ వెర్రి నమ్మకం ఏర్పడింది— ఓ రెండువందల మంది కూలీలతో ఓ యూనియన్ వెలిసింది— ఆ యూనియన్‌కి అప్పట్నుంచీ అతనే ప్రెసిడెంటుగా ఉండిపోయాడు.

యూనియన్ పెట్టిన కొత్తలో, ఎవళ్ళో వేరే యూనియన్‌ల వాళ్ళు వచ్చి "మనం అందరం ఒకటే" అంటే నిజమే అన్నాడు— అందరమూ ఒకటే అవటంలో కొన్ని లాభాలు ఉన్నాయని గ్రహించిన రంగసామి దాని మూలంగా యూనియన్‌ని ఇంకొంచెం బలంగా చేసాడు— ఎప్పుడయినా అన్యాయాల్లాంటివీ, గొడవలూ అయినప్పుడు ఇతర జనం కూడా వచ్చి గొడవగొడవ చేస్తే, కొన్నింటిని సాధించాడు.

742

మూడు నాల్గు సార్లు కూలిరేట్లు తక్కువని గొడవ చెయ్యగా వాళ్ళు రేట్లు పెంచారు- దాంతో వీళ్ళకి అతను దేవుడయి కూర్చున్నాడు.

మొట్టమొదట్లో యూనియన్ గొడవలు అతన్ని చికాకుపెట్టినా కొంతకాలంకి దానికి కొద్దిపాటి బలం రావటంతోనూ, ఇతర యూనియనులు మద్దతు ఉన్నాయనే నమ్మకంతోనూ అతను కొంచెం తన గురించి తాను గొప్పగా అనుకోటం మొదలు పెట్టాడు- యూనియన్‌లో ఉన్నది వందల మీదయినా తను చెప్పినది వేలమంది వినే స్థితి రావటంతో అతన్లో కొంచెం మార్పు వచ్చింది.

'రంగసామి లీడరు' అని అతని మనసులో స్థిరపడిపోయింది- కొట్ల వాళ్ళకి రంగసామి మాటలు అందరూ వింటారన్న నమ్మకం ఏర్పడేసరికి అతనంటే ఓరకం కోపమూ భయం పట్టుకొన్నాయి- (అయితే వాళ్ళ పద్ధతులు వాళ్ళకు లేకపోలేదు- మనుషులు మారతారనీ, వాళ్ళ దృక్పథాలు మారతాయనీ కొంతమందికి జ్ఞానం ఉంది.)

అయితే రంగసామికి 'తను లీడర్' అని అనుకొన్నాడేగానీ, ఆ బలం వెనక వున్న కూలి జనాల అండ అనీ, వాళ్ళందరూ కల్సి తన మాట వినటంవల్లె అది వచ్చిందనీ కొంతకాలంకి మర్చిపోయాడు.

"కూలివాళ్ళకి ఇంతకంటే ఎవడేటి సేస్తాడు-" అనేవాడు.

కూలివాళ్ళ పేర్లు వారానికీ పదిరోజులకీ మార్చి రాస్తున్నారని తెలీగానే అతను బజారు సంఘం వాళ్ళని కలిసాడు- రంగసామి రూల్సు ఇలాంటివి ఎలా తెల్సుకొంటు న్నాడన్నది వాళ్ళకి విచిత్రిం అన్పించింది.

అట్లాంటి పద్ధతులు అలాగే సాగితే, తనకి లాభం అని అతనికి తెల్సింది- (కూలీవోళ్ళకి ఏం పేర్లు ఏ రకంగా రస్తారో తెలీదు.)

ఆ తర్వాత అతను బస్తీ నుంచి కొద్దిగా దూరంలో ఉన్న పెంకుటింట్లోకి మారాడు- యూనియన్ గొడవలు చూట్టానికీ, కాయితాలు ఉంచటానికీ జాగా ఉండక పోతే బావుండదని అతనే అన్నాడు- లీడర్ అన్నవోడు అల్లాటప్పాగా గుడిసెల్లోఉంటే కొట్లవాళ్ళు మాట వినరన్నాడు.

కూలీ వాళ్ళు నిజం అంతే అనుకొన్నారు.

ఎందుకంటే అప్పుడప్పుడు కూలిరేట్లు రంగసామి గోలచెయ్యగా పెరుగుతూనే ఉన్నాయి.

తర్వాత కొంతకాలంకి గవర్నమెంటు మారటంతో యూనియన్ వాళ్ళు ఎవర్ని సపోర్టు చేస్తారు అన్నచోట గవర్నమెంటుని బలపరిస్తే మన మాట వాళ్ళు వింటారని అన్నాడతను- అతనికి ఎప్పుడు ఏం చెయ్యాలో తెలీటంవల్లే అటు కూలీవాళ్ళకీ ఇటు వర్తక సంఘం పెద్దలకీ అతన్తో రోజులు సాఫీగా సాగుతూనే వచ్చాయి.

మళ్ళీ కొంతకాలంకి మళ్ళీ గవర్నమెంటు మారగానే ఇతర యూనియన్ వాళ్ళు కొంచెం గొడవ అవసరం అన్నారు.

బజారువాళ్ళు కొత్తగా వచ్చిన గవర్నమెంటుని కాక ఓడిపోయిన వాళ్ళని సపోర్టు చేసారు.

అంతకు ముందూ చాలా గొడవలు, దారుణంగా కొట్లాటలు జరిగాయి- చాలా మంది కూలీల శవాలు పక్కనే పారుతున్న నదిలో కొట్టుకుపోయాయి- కూలీ జనాలకి 'కొంపా-జనం' అన్న వాళ్ళు లేకపోవడంతో వాళ్ళు చచ్చి ఉన్నారో బతికి ఉన్నారో ఎవళ్ళకీ అక్కర్లేకపోవటంతో అట్లాంటివి బయటకు రాలేదు.

అయితే చాలకాలంకి రంగసామి రంగంలో దిగాల్సిన అవసరం వచ్చింది.

జనాలని జంతువుల్లా వాడుతున్నారని ఊరేగింపులు జరిపీ, బస్తీలో మీటింగులు పెట్టీ అరిచాడు.

దానికితోడు పరిస్థితులూ కల్సివచ్చాయి.

ఓ సమయానికి విషయం ఎట్లా వచ్చిందంటే, 'అమ్మిన సరుకులు ఎత్తుకెళ్ళ టానికి కూడా' కూలీలు ఎవళ్ళూ ముందుకు రాలేదు- "రంగసామి అంటే ఏం అను కొన్నారో ?" అన్నాడు రంగసామి.

* * *

రెండుమూడు రోజుల్నుంచీ పేపర్లనిండా గందరగోళంగా వార్తలు పడ్తోన్నాయి.

'ఆహార వ్యవహారాల శాఖవాళ్ళు ఎందుకు చేతులుముడుచుకొని కూర్చునిఉన్నారో అర్థం కావటం లేదని' కొట్ల సంఘం వాళ్ళు అంటే,

'కొట్ల సంఘం తాలూకా పెద్ద మనుషులెవరూ తమని ఖాతరుచెయ్యటం లేద'ని లేబర్ డిపార్టుమెంటు వాళ్ళు నిస్సహాయత వెలిబుచ్చారు.

'పోర్టర్ల ఆగడాలు మీరిపోయి మాలో కొంతమంది ఆస్పత్రిలో చచ్చేలావుంటే లా అండ్ ఆర్డరు చూడటంలేదు పోలీసువాళ్ళు' అనంటే;

'అదంతా వట్టిది' అని పోలీసువాళ్ళు.

744

'అయినా రోజూ కోటిరూపాయలు దాటిపోయేలా డబ్బులు గడించేవాళ్ళందరూ కల్సి కూలీవోళ్ళకి కొద్దిపాటి బోనస్‌లాంటిది ఇవ్వలేకపోవటం సిగ్గుచేటు' అని లేబర్.

'గవర్నమెంటువాళ్ళు ఫలానాదీ అని నిర్ణయించి ఆర్డరు ఇస్తేగానీ మేం ఇవ్వం' అని కొట్లవాళ్ళు.

ఈలోగా ఓ కూలీవాణ్ని అరెస్టు చేసారు దొంగతనంమీద- తర్వాత అతన్ని వొదిలేసారు- అది దొంగతనం కాదని.

'అన్ని వస్తువుల రేట్లూ రాకెట్లలాగా పైకి వెళ్ళిపోతే మేం చస్తాము' అని పౌరుల లేఖలు.

*   *   *

నీలమ్మ దిగులుగా కూర్చుంది.

ఆమెకి వళ్ళంతా చచ్చిపోయినట్లు నొప్పిగా వుంది- పక్కనేవున్న చంటిపిల్ల గట్టిగా ఏడుస్తోంది.

రెండు నెలలు దాటిపోయింది—

అంతకుముందే ఓపూట తిండిగింజలుండే ఓరోజు ఉండని గతి- ఇప్పుడదీలేదు.

చంటిపిల్ల పాలకోసం కాబోలు ఇంకా గట్టిగా ఏడుస్తోంది.

నీలమ్మకి పాతికేళ్ళుదాటి రెండేళ్ళే అయినా ఆడదానికి ఉండాల్సినంత రొమ్ములు ఆమెకిలేవు- ఇంతకుముందు ఉండేవేమో గానీ ఇప్పుడవి ఎండిపోయాయి.

చిన్నగాఉన్న రొమ్ముల మచ్చికలు చీకిచీకి ఏమీరాక చంటిపిల్ల ఏడుస్తూనేఉంది.

చిన్నప్పుడు పల్లెటూర్లో ఉన్నప్పుడు నీలమ్మ పొలాల్లో వెళ్ళినప్పుడు పచ్చగా కన్పించే గడ్డిపరకలు అప్పుడప్పుడూ నవుల్తూఉండేవి- అవి కొద్దిగా ఉప్పగా పుల్లగానూ నీలమ్మకి రుచిగానూ ఉండేవి- అయితే ఆకలిమీద నవిలేది కాదుకాబట్టి ఉమ్మేసేది.

ఆమె ఇందాకట్నుంచీ కొంచెం దూరంలో ఉన్న కాలవవైపు చూస్తోంది- ఎందుకో ఒక్కసారిలేచి అటుగా వెళ్ళింది.

కొద్దికొద్దిగా వెన్నెల పడ్తున్న కాంతిలో కాలవ నీళ్ళు కదుల్తూ కనిపిస్తోంది- గట్టువారన మొక్కలున్నాయి- నీళ్ళ వొడ్డున గడ్డి పెరిగింది.

నీలమ్మ గడ్డి పీకుతూ కూర్చుంది- కాసేపటికి రెండు దోసిళ్ళలో గడ్డి తయారయింది- ఆ తర్వాత అక్కడే కూర్చుని, మెల్లిగా ఆ గడ్డంతా తింది- కొద్దిగా ఆకలి

745

తగ్గిందనిపిస్తే, నీళ్ళు తాగింది— కడుపులో వికారం అన్పించింది గానీ, ఇందాకట్లా ప్రాణం పోయే నీరసం అన్పించలేదు ఆమెకి.

'గేదెలకే కాదు, మనిసికీ ఇదే తిండీ' అనుకొంటూ మెల్లిగా గుడిసెలవైపు నడిచింది.

* * *

"ఏటి సెయ్యమంటావ్— సవ్వమంటావేటి ?" కసిరాడు అప్పల్రాజు.

గుడిసెలో కిర్సనాని దీపం ఇంతకు ముందయితే ఉండేది గానీ ఇప్పుడులేదు— గుడిసెలోపల అంతా చీకటిగానే ఉంది.

బయట మసక వెన్నెల.

లోపల కూర్చుని ఉన్నవాళ్ళకి చీకటి అలవాటయిపోవటం వల్ల ఒకళ్ళ ఆకారాలు ఒకళ్ళకి లీలగా కన్పిస్తున్నాయి.

"అదేట్రా, కసురుకొంటావు నాయన" అన్నాడు నాయుడు.

"కానయితే ఏటిసేసేది సెప్పు, ఆ లంజికొళ్ళే కొట్లుతీయరు— మనకా పనుల్లేవు— ఎళ్ళేవాళ్ళు ఎళ్తారుగానీ సొమ్ములా మాకు లేవాయి— సావాలా ? వూరు పొతే కసింత గడ్డయినా తిని సావచ్చు— పట్నవని వస్తే పీణాలు పోతున్నాయి" అన్నాడతను.

"ఏటందరూ సచ్చిపోయినట్లు, ఎవడికాడు కాడికెళ్ళిపోతే కొట్లు తెరుస్తారు గానీ మనం బతకం" అన్నాడు చిట్టి.

"అదీ నిజమేనాయె— కానీ చిట్టిగా, నే సవ్వలేనురా—"

"నువ్వు సవ్వపద్దు— మనం బతకాల— అందరం వుంచేనే మనం బతుకుతం" అన్నాడు చిట్టి.

అప్పల్రాజు ఉండిపోవటానికి ఒప్పుకొన్నాడు.

* * *

ఇంకా తెల్లవారలేదు— మసక వెన్నెల ఇంకా అలానే వుంది.

అక్కడంతా హడావిడిగా వుంది.

చిట్టి రాత్రి పన్నెండు గంటల్నుంచీ గుడిసెలన్నీ తిరుగుతూనే ఉన్నాడు— అతనికి మనుషులంతా జీవంలేనట్లు దిగాలు పడిపోయినట్లు అన్పించింది.

"లేవండెహె, ఈ పాటి దానికేటంత అదయిర్యం పడిపోతున్నారు? లేవండి" అన్నాడతను.

"ఏటి సెయ్యమంటావ్ సిట్టిబాబూ– ఈ కూలోడి కర్మం ఇలాగ మసయిపోతంటే–"

"ఏటి బజార్లేకుంటే బతుకుల్లేవేంట్రా– లేవండి లేవండి, అందరం కల్సి పనులు ఎతుకుదాం– ఎవడికేది దొరికితే అదే బతుకు లేవండి."

చిట్టి రాత్రి పెట్రొమాక్సు లైట్లు కొన్ని సంపాదించాడు.

రాత్రి మూడయేసరికి వాటన్నింటినీ చిట్టి, ఇంకో పదిమందీ కలిసి వెలిగించారు– "ఏటో ఏటవుద్దో" అంటూనే ఉన్నారు వాళ్ళు.

గుడిసెలన్నీ గందరగోళంగా వున్నాయి– ఎవరికీ నిద్దర్లు లేకపోయినా మొఖాలు నిద్రపోవాలన్నట్లుగా లేవు.

అంతా కలిసి జనం పోగయ్యారు.

చిట్టి ఓ డప్పు పట్టుకు కొట్టటం మొదలుపెట్టాడు.

"పదండోయ్ సాములూ, వూరల్లా తిరుగుదాం– దొరికిందే పని చేసుకొందాం" అంటూ, చప్పుళ్ళకి ఇంకా మంద చేరారు.

పెట్రమాక్సు లైట్లు మధ్య పెట్టి చుట్టూతా మనుషులు గెంతుతూ పాడుతున్నారు– 'మనుషులు చావకూడదనీ, చచ్చేదాకా పనికోసం పెనుగులాట తప్పదనీ' ఆ పాటల అర్థం– అవి ఎవరూ రాయలేదు– రోజూ మాట్లాడే మాటల్నే పాటలుగా పాడారు.

పాటల్తో మొదలయిన గుంపు మెల్లిగా పెట్రొమాక్సులన్నీ పెట్టుకొని బయల్దేరారు– అంతా కలిసి నాలుగయిదు వందలమంది తయారయారు.

గుంపంతా దీపాల్తో కదుల్తుంటే బస్తీలోఉన్న వెలుగంతా మెల్లిమెల్లిగా వూర్లోకి పాకిపోతున్నట్లు కనిపిస్తోంది– "ఏటో సిట్టిబాబుకి ఆశ–" అన్నారు వుండిపోయినవాళ్ళు.

వూరింకా నిద్రలేవలేదు.

రోడ్లన్నీ ఖాళీగానూ, వికారంగానూ వున్నాయి– తెల్లవారితే అవన్ని ఇరుగ్గానూ చీదరగానూ తయారవుతాయి– పెద్దరోడ్లూ చిన్నరోడ్లూ అన్ని నడుచుకొంటూ వాళ్ళంతా నడుస్తూనే ఉన్నారు– నడుస్తూ పాటలు పాడుతూనే ఉన్నారు– కొంతమంది గెంతుతున్నారు– చిట్టి కొంతమందితో ముందు నడుస్తూ దారిచెప్తున్నాడు.

రాత్రి చీకట్ని ఇంకా వదల్లేదు.

దూరంగా కన్పిస్తున్నాయి మిణుకుమిణుకు మంటూ చిన్నచిన్న వెలుగు[illegible]తులు. దూరంగా అదంతా ఎందుకూ పనికిరాని ఖాళీ ప్రదేశం చీకటుంది– దానికి కొద్దిగా అవ

తల శ్మశానం వుంది– కాళీ ప్రదేశం నిండా బస్సులూ ట్రక్కులూ ఆగివున్నాయి– వాటి మధ్య ఇరుకు ఇరుకుగా చోటుంది– ఆ ఇరుకులోనే వున్నారు మనుషులు– వాళ్ళ దగ్గిర చిన్నచిన్న కిర్సనాయిలు దీపాలు వున్నాయి– అక్కడేవున్నాయి నీళ్ళతో బక్కెట్లు.

"పదండి పదండి" అంటూ ఇంకా వేగంగా ముందుకెళ్ళాడు చిట్టి.

పెట్రొమాక్సులైట్లూ, చప్పుళ్ళూ, అరుపులూ విన్పించిన వాళ్ళందరూ బస్సుల మధ్యనుంచి బయటకువచ్చి నిలబడ్డారు– వాళ్ళకి దూరంగా గుంపు కన్పిస్తోంది– వాళ్ళకి ఏమి అర్థంకాలేదు– బస్సుల మధ్య నుంచి వచ్చిన క్లీనర్లూ, చెక్కర్లూ అందరూ కల్సి ఓ రెండొందల మందున్నారు.

"ఏటి జట్టి అవుతుందేటి" అన్నాడతను.

"అదే తెలవట్లేదు" అన్నాడు ఇంకొకతను.

లైట్లూ మనుషులూ దగ్గిరకు వచ్చారు– "ఏట్రా సిట్టీ ఏటిదంతా, ఏటీ దండ యాత్ర" అన్నాడు దేవుళ్ళు ముందుకొస్తూ.

చిట్టి పరుగు పరుగున ముందుకు వచ్చేసాడు– మిగతావాళ్ళు మెల్లిగానే నడుస్తున్నారు– "ఇవి చేతులుకావు, కాళ్ళురా దేవుళ్ళూ– జనమంతా మాడి సత్తన్నారు, గడ్డయినా పీకు తింటానికి– గంజయినా వస్తుందని అందరం కదిలాం" అన్నాడతను.

"అయితే మాఁవేమిటి సేత్తాంరా ?" అన్నాడతను.

"ఏటీ లేదర్రా రాత్రిళ్ళు బస్సులు కడగటం, క్లీన్ సెయ్యటం మావోళ్ళకి కొంతమందికిచ్చేసి, రాత్రిళ్ళు కసింత తొంగోండి మీరంతా– టీ నీళ్ళకీ రొట్టెముక్కకి జీతాల్లో ఓ పావలా ఇయ్యండి, అంతే మీలాటి పనోళ్ళమే– మీరంతా కాదంటే సచ్చిపోతం" అన్నాడు.

క్లీనర్లందరూ ముఖాలు చూసుకొన్నారు.

"అవునీళ్ళకీ ఇంత గెంజి లేకుంటే ఎట్లా, మనకా పనికి బొక్క సినిగిపోతోంది. నాలుగు బీడీల సొమ్ములు తక్కువయితే వచ్చింది యేమ్లేదుగానీ, రండర్రా– బజార్లమూసి మిమ్మల్ని సంపుతున్నారు, మమ్మల్నీ సంపుతున్నారు– ఉండండెహె" అన్నాడతను.

దాంతో కొంతమంది చిట్టితో వచ్చిన వాళ్ళు బస్సులమధ్య దూరిపోయారు. అప్పటిదాకా కడుగుతున్నవాళ్ళు 'కాసేపు తొంగుందాం'మని బస్సు సీట్లలో పడకేసారు.

"పదండర్రా మిగతావాళ్ళం వేరే సూద్దాం–" అన్నాడు చిట్టి. 748

మళ్ళీ గుంపంతా కదిలింది.

పావలాలకీ అర్ధరూపాయిలకీ మనుషులకి పని బేరం ఆడుతున్నందుకు చిట్టికి బాధగా అన్పిస్తోంది గానీ, అదీ నిజ్మా, పావలా రొట్టయినా లేకపోతే జనం ఇంకా దీనంగా తయారయిపోతారన్న నిజం అతనికి ధైర్యం చెప్తోంది. దరిద్రం మనుషులని దిగజారుస్తుంది గానీ వందల మంది మనుషులు ఇలా రొట్టెముక్క కోసం నిద్దర్లయినా లేకుండా వెతుకులాడే దౌర్భాగ్యాన్ని అసహ్యించుకున్నాడు.

"దేశం ఇచ్చింది ఇంతే–" అని అతను అనుకోలేదు. "దేశంలో లభ్డీకొళ్ళు పన్నే దొంగ లంజ నాటకం" అనుకొన్నాడు.

తెలతెలవారుతోంది వాళ్ళు మళ్ళా ఊరుమధ్యకి వెళ్ళేసరికి.

అప్పటికీ వీధుల్లో మనుషులు తిరగటం మొదలయిపోయింది.

వెల్తురు కొద్దికొద్దిగా వస్తున్నా పెట్రొమాక్సు లైట్లు ఇంకా ఆర్పలేదు వాళ్ళు– కొద్దికొద్దిగా జనాలతో ఉన్న రోడ్లు వాళ్ళందరితో రద్దీగా తయారయాయి– ఇంకాసేపయే సరికి వాళ్ళు మరో గుడిసెల ప్రదేశంకి చేరారు.

ఓ గుడిసె బయట అంతా ఖాళీ ప్రదేశం వుంది.

గుడిసెకి ఆనుకొని ఓ బోర్డుకూడా వుంది– ఏదో రిక్షా కార్మిక సంఘం బోర్డది. ఆ ముందు చాలా రిక్షాలు వున్నాయి– దాదాపు అన్నింటిలోనూ రిక్షాల్లాగేవాళ్ళు పడుకొని నిద్రపోతున్నారు– వాళ్ళందర్నీ తట్టి లేపేసరికి చాలాసేపట్టింది.

"ఏటి గోల" అని విసుక్కొంటూ లేచారు కొందరు.

తర్వాత కన్పించారు వాళ్ళంతా. కొద్దికొద్ది వెలుగులో పెట్రొమాక్సు లైట్లు కాంతి పోగొట్టుకొన్నట్లు కన్పిస్తున్నాయి– అందులో కొందరి రిక్షావాళ్ళను గుర్తుపట్టారు. మళ్ళీ చిట్టి బేరం పెట్టాడు– వాళ్ళు రిక్షాలు లాగలేనప్పుడు ఎంతో కొంత సేపు 'మావోళ్ళకి' ఇమ్మని. వాళ్ళు చాలాసేపు ఆలోచించారు– 'ఏటి గొడవవుద్దో' అంటూ గొణిగారు– "ఏటీ అవద'న్నాడు చిట్టి– ఆఖరికి మద్దేనంపేళలో కొంతమంది ఇస్తాం అన్నారు– రేత్రి బాగా అయింతర్వాతయితే ఇస్తాం అన్నారు ఇంకొంతమంది– కొంత మంది అప్పటిదాకా రిక్షాలుతొక్కి వొళ్ళు నొప్పులొచ్చిన వాళ్ళు అప్పుడే ఇచ్చారు.

చిట్టి మొఖం కొద్దిగా తేటపడింది.

'ఫేక్టరీల్లో కేజువల్ మనుషులు కావాలేటో సూద్దాం' అంటూ మళ్ళా నడిచాడు– తెల్లవారి సూర్యుడు ప్రపంచం మీదకి రాగానే వాళ్ళు లైట్లు ఆర్పేశారు.

749

దూరంగా గుంపును చూస్తూనే ఫాక్టరీ గేటు దగ్గిరున్న జవాను గేటు బయటకు వచ్చి 'క్యా?' అన్నాడు. మనుషులెవరూ అక్కర్లేదని కంపెనీ తరఫున ఖరాకండీగా చెప్పేశాడు. అలా వాళ్లంతా ఐదారు పెద్ద పెద్ద ఫేక్టరీలు తిరిగారు గానీ ఎక్కడా గేటు దాటి లోపలకు వెళ్లలేదు.

కొంచెందూరంగా కొండలున్నాయి. దానికున్న దారంతా అడ్డ దిడ్డంగా వుంది. తుప్పల్లోంచీ, డొంకల్లోంచి మనుషులంతా విసుగూ విరామం లేకుండా నడిచివెళ్ళేసరికి ఎనిమిది గంటలయింది–

కొండపక్కన ఐదారు లారీలున్నాయి.

కొంతమంది రాళ్ళు కొడుతుంటే, కొంతమంది తట్టల్లో రాళ్ళు లారీలోకి ఎత్తుతున్నారు– వాళ్ళమధ్య ధుమధుమలాడిపోతున్నాడు మాలచ్చినాయుడు– ముందు రోజు బరంపురం నుంచి వచ్చిన మేస్త్రి లేబర్ జనాలు దొరకలేదని చెప్పాడు– దాంతో పని టయింకి అయేలా లేదని అతని ఖంగారు– వూర్లో జనాలు రాళ్ళు కొట్టటానికి దొరకరా అంటే అదీలేదు– కాపోతే కొందరు జనం చవక కొందరు ఎక్కువ సొమ్ములుచ్చుకొంటారు.

గుంపు చూస్తూ "ఏటి బరంపురం ముఠా ఏటి?" అన్నాడు– కాదన్నాడు పక్కనే ఉన్న మేస్త్రి– "మరెవళ్ళు" అన్నాడు నాయుడు.

కాసేపటికి తెల్సింది నాయుడికి– వాళ్ళు ఎవళ్లయినా– రాళ్ళు కొట్టాటానికి తయారుగా వున్నారు. అని ఇంకా వాళ్ళ డొక్కలు చాల రోజుల్నుంచీ మాడుతున్నాయని కూడా తెల్సింది.

"జనం కావాలి కానీ, బరంపురం వోళ్ళు రావాల." అన్నాడు నాయుడు చిట్టితో.

"కాదు, బాబ్బాబు ఆళ్ళొచ్చేదాకయినా ఇంత పనియ్యి."

"కానయితే– ఆళ్లొస్తే మీరెళ్ళి పోవాల. అదీ కాక...." అనాగిపోయాడు నాయుడు, కాసేపాగి "అబ్బొ జనాలు ఎస్తంటున్నావ్. మరి పనేటిసేస్తార్రా?" అని నవ్వాడు. చిట్టి ముఖం విచారం అయిపోయింది.

"మనిషికో రూపాయిస్తార్రా– మరిష్టమయితే ఓ వందమందుండండి–" అన్నాడు.

వందమంది ఉండి పోయారు.

*   *   *

పెద్దరోడ్డు జంక్షన్‌లో అన్ని వైపులకీ ఎర్ర సిగ్నల్ వచ్చింది. రోడ్డు దాటి వెళ్ళాల్సినవాళ్ళంతా ఖంగారుగా కార్ల ముందు నుంచి అవతల వైపుకి నడుస్తున్నారు.

కార్లన్నీ బారులు తీరి ఆగిపోయాయి.

ఫుట్‌పాత్ మీద నిలబడి వున్నారు వీళ్ళు ఓ పాతిక మంది.

సిగ్నల్ వచ్చి కార్లు ఆగిపోగానే కార్ల మధ్యకి పరిగెత్తారు.

"బాబూ ఓ ఐదు పైసలియ్యండి బాబూ— ఆకల్తో సచ్చిపోతున్నాం—"

వాళ్ళకి పోటీగా రోజూ అడుక్కొనేవాళ్ళు కూడా 'ధర్మం బాబూ' అంటూ కార్ల మీద పడ్డారు— రెండు నిముషాల తర్వాత కార్లన్నీ వెళ్ళిపోయాయి.

'యీాళ్ళెవళ్ళ' అంటూ విసుక్కొన్నారు రోజూ వుండేవాళ్ళు.

మధ్యానం అయేసరికి వాళ్ళంతా కలిసి కొత్త బిచ్చగాళ్ళతో కలియబడ్డారు.

"ఏటి సేత్తాం మా కొట్లన్ని మీసీసారు— మేమూ కూలీవోళ్ళమే" అన్నారెవరో.

'పొండి పొండి' అసరిచింది ఓ పాతికేళ్ళ అమ్మాయి— చూట్టానికి పిచ్చెక్కిన మనిషిలావుంది— కాసేపటికి కొత్తవాళ్ళంతా పెద్దబజారుకేసి గుంపుగా నడిచారు.

* * *

స్టేషన్ అంతా రద్దీగా వుంది.

'ఏటవుద్దో' అంటూ ఓ చోట కూలబడ్డారు.

'ఏటవుద్ది— గెంచేస్తే దిగిపోవడమే' అన్నాడు కిష్టిబాబు— "ఏటో కలో గెంజో తాగి తొంగోవాల— మసూర్లో మనకేటి పాతివుందో సూడాల" అన్నాడో ముసిలతను.

కాసేపటికి వచ్చిన ట్రెయిన్‌లో ఓ బోగీనిండా టిక్కెట్లు కొనని వాళ్ళంతా తొందర తొందరగా నిండిపోయారు.

* * *

సుందర్రావుకి పేరయితే పెట్టారుగానీ అతను అందంగా ఉండడు— అదీకాక యాభయ్ ఏళ్ళు దాటిపోయిన తర్వాత అందం ప్రసక్తి అతనికీ రాలేదు— ఎమ్మెల్లే అయిన తర్వాత ఇలాంటివన్ని మర్చిపోయాడు అతను.

ఈమధ్య కొన్ని రోజులుగా బొత్తిగా చిరాగ్గా వుంటోంది అతనికి.

మొన్న మొన్న ముఖ్యమంత్రితో పెద్ద గొడవయింది— దాంతో ఈ పెద్దబజారు గొడవంటే కోపంగా వుంది— చంద్రశేఖరంగారూ వాళ్ళూ వచ్చి గంటలు గంటలు దీర్ఘంగా గొడవ చెప్పారు— గవర్నమెంటు వాళ్ళకి బొత్తిగా ప్రజల శాంతిభద్రతల గురించి పట్టింపు లేదన్నారు— ఇట్లా అయితే సుందర్రావు లాంటి వాళ్ళని ఎన్నికల్లో

గెలిపించి 'మాకు' ప్రయోజనం ఏమిటన్నారు– అయితే ఏం చెయ్యమంటారంటే అసెంబ్లీలో మీరంతా చేతులుముడ్చుకొని కూర్చుంటే మేం చిప్ప పట్టుకోవాల్సి వస్తుంది అని తేల్చారు.

దాంతో అసెంబ్లీలో పెద్ద దుమారంలేపాలని అనుకొన్నాడు సుందర్రావు– వున్న కొద్దిపాటి అపొజిషన్ వాళ్ళతో కలిసి ఎట్లా అయితే ప్రశ్నలతో వేధించాడు.

"మేం ఏమి గుడ్డివాళ్ళం కాదు" అన్నాడు ముఖ్యమంత్రి.

"మరయితే జనాలందర్నీ ఎందుకిలా ఏడ్పించటం?" అని సుందర్రావు అన్నాడు.

"ప్రతి దానికీ గవర్నమెంటు జోక్యం అంత మంచిది కాదు– అయినా కూలీ వాళ్ళూ, షాపు ఓనర్లూ ఒప్పందాలు కుదరక షాపులు మూసుకొని కూర్చుంటే మధ్యలో మేం ఎందుకు దూరాలి?" అన్నాడు ముఖ్యమంత్రి.

దాంతో అసెంబ్లీలో తేలేది ఏమి లేదనుకొన్నాడు సుందర్రావు.

అందుకే రెండు రోజుల క్రితం బజారు వెళ్ళి స్వయంగా చూశాడు.

మళ్ళీ ఇవాళ సాయంత్రం.

అతనక్కడికి వెళ్ళేసరికి– దూరంగా ఫాక్టరీలు వదిలేపొగా, గాల్లో దుమ్మూ అంతా కలిసి చీకటిలేకపోయినా వెల్తురు అట్టే లేనట్లు కన్పిస్తోంది.

కొట్లన్నీ కట్టేసివున్నాయి– కొందరు మాత్రం ఆఫీసులు తెర్చుకొని కూర్చున్నారు గానీ పని మాత్రం ఏమీ జరగటం లేదు.

అక్కడ స్టేజీ అదీ కట్టివుంది– మైకులో గోలగోలగా వుంది.

కూలీవాళ్ళు చాలమందే వున్నారు.

సుందర్రావు పెద్ద ఉపన్యాసమే ఇచ్చాడు– దాని సారాంశం అంతా కలిపి గవర్నమెంటు సరిగా ఈ విషయాన్ని పరిశీలించటం లేదని. కూలీవాళ్ళు దౌర్జన్యాలు జరపకుండా ఓనర్లతో సహకరించటం మంచిదని. కూలివాళ్ళకు కూలి డబ్బులు పోవటంమీద అతను చాలా ఆందోళన చూపించాడు.

"కొట్టు వాళ్ళేం మీ విరోధులు కారు– ఒక్కకుటుంబంలా వుండాల్సిన మనుష లంతా కొట్టుకుని కూర్చుంటే వుంటే దేశం ఏం ముందుకి వెళ్తుంది? అదీకాక చంద్ర శేఖరంగారు అనేదేమిటంటే కూలి రేట్లు పెంచుతామని వాళ్ళు మీతో అన్నాకూడా మీరే సహకరించటం లేదని."

752

"చస్, అదంతా బూటకం" అని అరుపు వినిపించింది. దాంతర్వాత గోలగోల అయింది. సుందర్రావు రాళ్ళు పడకముందే స్టేజీ దిగి వెళ్ళిపోయాడు.

చిట్టికి ఎదురుగావున్న మనిషికి సలభై ఐదేళ్ళుంటాయి- కొంచెం లావుగా వున్నాడాయన- మనిషి సలుపు కిందకే వస్తాడు- బట్టలు మాసిపోయి వున్నాయి. ఆయన చాల పొదుపుగా అన్నాడు.

"మనుషులు బరకటానికి ఒకోసారి ఆకలి చావులూ, ఇట్లాంటి విపరీత పరిస్థితులూ తప్పవు" అని.

"ఏటి సేద్దామన్నా కుదరకున్నది- రంగసామి ఉలకడూ పలకడు" అన్నాడు చిట్టి.

"తొందర పడమాకు" అన్నాడాయన.

కసేపు ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

సముద్రం పొడ్డున సముద్రంపేసే మోత చేవుల్లో గీ పెడుతోంది- దూరంగా సముద్ర పొడ్డున్నవున్న ఓ చిన్న హోటల్లో లైటుకాంతులు- కొద్ది దూరంలోవున్న ఓ దేవుడిగుడి.

ఆయనే మళ్ళీ అన్నాడు.

"చూడు చిట్టీ, బతుకులో ఒకోమాఱు 'ఇది ఘోరం' అని తెలిసీ మనం కొంత కాలం వరకూ ఏమీ చెయ్యలేకుండా వుండిపోవాల్సొస్తోంది- పల్లెజలు చచ్చిపోతూనే వుంటారు- వాళ్ళకోసం మనుషులూ రక్తాలు ధారపోస్తున్నారు- అయినాసరే ఇంకా నాయం రాలేదంటే- పల్లెజల రక్తాన్ని ఇంకా అమ్ముతూనే ఉన్నవాళ్ళున్నారు- రంగసామి చేసేదీ అంతే- నాలుగ్గలాసుల రక్తంతాగే ఓసర్ని మావాళ్ళ రక్తం రెండు గళాసులే తాగు అంటున్నాడు- నాలుగ్గలాసులూ ఒకేసారి తాగేస్తే, మనిషి మిగల్డు అని తెల్సినవాళ్ళ పప్పుకొంటున్నారు."

"ఆ లంజ కొళ్ల పాతేస్తే సరి" అన్నాడు చిట్టి.

"ఆ తొందరే పడొద్దు. దాని మూలంగా విరోధాలు పెంచుకోటం తప్పించి పొంగేది లేదు. మనం రాజికి దిగకుండా ఎంతకాలం దీనిలో పనిచెయ్యగలం అన్నది చూసుకోవాల. మనుషులకు నిజాన్ని నిజంగా చెప్పటం, దిగిజారిపోయే ధైర్యాన్ని కూడ గట్టటం, ఏది ఏమయినా పనిచేసే వాణ్ణి పని చేసేవాడుగా వాళ్ళ రూలు ప్రకారం అయినా వప్పుకోనేలా చెయ్యాలి. జనం సముద్రంలా మీద పడితే భూమి మునిగిపోతుంది గానీ తేలదు." అన్నాడు.

753

ఆ తర్వాత వాళ్ళిద్దరూ చాలాసేపు కూర్చున్నారు.

చిట్టి ముందు లేచి వస్తానని శెలవు తీసుకొన్నాడు, అతనికి పూరంతా తిరగా లనిపించింది. కూలి వాళ్ళంతా పూరంతా చెల్లా చెదరుగా అయిపోయారు. కొందరు రిక్షాల్లాగుతోంటే, కొందరు రాళ్ళు కొడుతున్నారు, కొందరు ష్టేషన్ కాడ సామానులు మోస్తున్నారు. కొందరు అడుక్కొంటున్నారు. అతను రోడ్లు తిరుగుతూ చివరికి ష్టేషన్ చేరుకొన్నాడు.

*   *   *

అప్పల్రాజు ప్లాట్ ఫారం మీద నేల మీద కూర్చుని అదే పనిగా వచ్చేపోయే రైళ్ళను చూస్తూ కూర్చున్నాడు. అతనికి ఏడుపు వస్తోంది. ఇంట్లో గుంట వెధవలు ఏంతింటున్నారో ఏం చేస్తున్నారో అని అతనికి బెంగపట్టుకొంటోంది యీ మధ్య. ఈ బజారు మూసేసే ముందు వరకూ అతను పూరికి డబ్బులు పంపిస్తూండే వాడు. వచ్చే దాంట్లో సగం పంపించేసి మిగతా సగం ఖర్చు పెట్టుకొనేవాడు. ఎప్పుడో సంవత్సరానికీ అలాగ పూరెళ్ళే వాడు.

"నానూ పట్నం వొస్తాను మావాఁ" అని సూకాలు అన్నప్పుడల్లా—

"ఇప్పుడేటి లేవే పిల్లా, కొంత కాలవాగు" అనేవాడు పెళ్ళాంతో— ఆ వున్న కొద్ది రోజులే అతనికి పెళ్ళాంతో బతుకు.

అక్కడ వాళ్ళకీ అంత బాపుండేది కాదు— ఏదయినా అయితే ఎవరూలేరు— కాపోతే అప్పల్రాజుకీ పట్నంలో సర్దుకుపోటం కష్టమవుతుందని వాళ్ళనలానే వుంచే సాడు— రెండుమార్లు పుట్టిన పిల్లలు పుట్టిన నెలకీ రెండు నెల్లకీ చచ్చిపోతే పెళ్ళాడు— అలాంటప్పుడు సూకాల్ని పట్నం తీసుకొచ్చేద్దామనుకొన్నాడు గానీ ఆ పని చెయ్యలేదు.

'ఏటి సెయ్యాల?' అదే అతనికి బోధపడటంలేదు— 'ఆ వూర్లో నేటుంది?' 'కానేటి సెయ్యాల యీడ ఏటుంది బుగ్గి.'

వచ్చేపోయే రైలు చూస్తూ తటపటాయిస్తున్నాడు అప్పల్రాజు.

'ఒరేయ్ అప్పిగా' అని కేక విన్పించి వులిక్కిపడ్డాడు.

చిట్టి మెల్లిగా నడుచుకొంటూ వచ్చి అప్పల్రాజు భుజం మీద చెయ్య వేసి కూర్చుంటూ, "ఏటి బేరం దొరక లేదేటి?" అన్నాడు.

అప్పల్రాజు కళ్ళల్లోంచి వస్తున్న నీళ్ళుచూస్తూ, "ఏటిరా ఏటయింది" అన్నాడు.

"ఏటీ నేదురా— పెళ్ళాన్నీ పిల్లల్నీ ఒగ్గేసి ఏటీ పాడు బతుకనిపిస్తోంది."

చిట్టికి కళ్ళంబట నీళ్ళొచ్చాయి- అప్పల్రాజు అనటమేగానీ పెళ్లాన్ని ఎప్పుడూ తీసుకురాలేదు- మనుషులు నిర్జీవంగా యంత్రాల్లా పన్చేయటం అతనికి బాధ కల్గించింది గానీ, 'ఆరోజు దాకా తప్పదు' అనుకొన్నాడు.

అతనికి లీలగా ఎక్కడో ఆకాశంలో రక్తం ఛాయలు ఎఱ్ఱగా కన్పించి నట్లు అన్పించింది. ఆ రక్తపురంగు ప్రపంచమంతా కనబడుతుందని అతను అనుకొన్నాడు. ఆ ఎఱ్ఱ రక్తం ఛాయలు దిగివచ్చి మనుషుల రక్తంలో కల్సిపోయిన్నాడుగానీ ఇవన్నీ తప్పవు- అనుకొన్నాడు.

"మనిషి రగతం, ఎఱ్ఱని జెండారంగూ ఒకటే కదరా" అన్నాడు అప్పల్రాజుతో.

"ఏటి-" అన్నాడు అప్పల్రాజు అర్థంకాక.

"పద పద-" అన్నాడు చిట్టి లేస్తూ.

* * *

చిట్టి ఎప్పుడో చిన్నప్పుడు రోడ్డుమీద పడివుండేవాడు- కొంతకాలంకి బజారు చుట్టుపట్ల తిరిగాడు- అప్పట్లో టీనీళ్ళు అందించటం దగ్గిర్నుంచి నేల వూడవటం దగ్గిర్నుంచి అన్నిరకాల పనులు చేసేవాడు- అతనున్న షాపుటసరు మంచివాడవడంతో కొంతకాలంకి పని ఇచ్చాడు.

అతను పనిచేసే షాపులోనే గుమస్తా వుండేవాడు- అతను సన్నగా పొడవుగా, కళ్ళజోడు పెట్టుకొని మనిషి బాగా నీరసంగా వుండేవాడు- సిగరెట్లు తాగుతూ, అప్పుడప్పుడూ దగ్గుతుండేవాడు- షాపూ, గోడవునూ అన్నీ చీకటిగా వున్నట్లుండేవి- లోపల వున్న మనుషులకు గాలిగానీ, వెల్తురుగానీ వుండేది కాదు- ఆ చీకటి గదిలో అతను కూర్చుని పుస్తకాల్లో పద్దులు రాస్తుండేవాడు- అక్షరాలు కన్పించక కాయితాలను కళ్ళకు దగ్గిరగా పెట్టుకు చూసేవాడు. అతనే చిట్టిని ఒకసారి అడిగాడు-

"నీకు చదువొచ్చా?" అని.

"నాకేటొస్తుంది?" అన్నాడు చిట్టి- ఆ గుమాస్తా ముఖంలో ఎందుకో చిన్న చిరుకాంతి లాంటిది కన్పించింది- "నేన్నేర్పుతా" అన్నాడు- చిట్టికి ముందు అర్థం కాలేదు- ఆ తర్వాత రాత్రిళ్ళు చాలసేపు ఉండిపోయాడతను- మెల్లిమెల్లిగా కొద్దిగా చదవటం, రాయటం నేర్చుకొన్నాడు చిట్టి.

చాలాఏళ్ళ క్రితం ఓ సంఘటన జరిగింది- అది ఇప్పటికీ చిట్టికి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కడుపులో తిప్పుతూంది.

— (మిగతా 67 వ పేజీలో)

755

(48 వ పేజీ తరువాయి)

ఆరోజు జోరున వాన కురిసింది.

మధ్యాహ్నం ఒంటి గంటయింది– వూరికి దూరంగా ఎక్కడో సామాను చేరవేసి వస్తున్నాడు– అతను వచ్చే దారంతా ఫుట్‌పాత్‌లమీద వాననీళ్ళన్నా మనుషులున్నారు– వాళ్ళందరికీ వుంటానికి వేరే చోటులేదు– కొంతమంది ఇటికలూ, కఱ్ఱముక్కలూ పేర్చి, గోడకానించి చిన్న గుడారాల్లా వేసుకొన్నారు– వానకీ గాలికీ కొన్ని ఎగిరిపోయాయి.

అతను ఒకచోట అలా ఆగిపోయాడు.

అతని ఎదురుగా ఫుట్‌పాత్ మీద ఉన్నది ఓ కుష్ఠువాడు– అతను ఎగిరిపోయిన చిన్న చిన్న తాటాకులను సర్దిపెట్టుకోవాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నాడు– కొద్దిగా అవతల వుంది ఓ నల్లకుక్క– అది అతన్ని దీర్ఘంగా చూస్తోంది– ఒక్కసారి గాలి ఎదురు కొట్టింది– ఓ తాటాకుతో పాటుగా ఎగిరిపోయాయి అతని చేతి వేళ్ళు రెండు– అవి కొద్దిదూరంలోపడగానే నల్లకుక్క వాటిని గభాల్న నోటితోకర్చుకొని పారిపోయింది.

ఆ కుష్ఠతను గాలికి తూలి పడిపోయాడు.

చిట్టి అతన్ని పట్టుకు లేవనెత్తాడు– అతని కెందుకో కుష్ఠు మనిషిని చూసి ఛీదరింపు కలుగలేదు– విపరీతమయిన ఏడ్పు కన్పించింది చిట్టికి అవతల మనిషి ముఖంలో.

“నేను చదువుకున్నోడినే– కానీ, పకరోజు ఈ దౌర్భాగ్యం పట్టుకొంది– పేటలో అందరూ బయటకు ఈడ్చేశారు నన్ను– ‘ఇది భయంకర పాపంకాదు, జబ్బు’ అని ఎంత ఏడ్చినా వినలేదు ఎవరూ–” అన్నాడు అవతల మనిషి. ఇంకా అతనే చిట్టితో అన్నాడు–

“ఇది కుష్ఠులోకం– పేదరికం అలా చివరికంటా వెళ్తే కుష్ఠు రోగంతో చివరి దశకి వెళ్తుంది– ఈ దరిద్రం దేశంలో ఇలా తప్పదు” అని.

చిట్టి భయంగా అతని వంక చూశాడు– అవతల మనిషి ఇంకా చాలా చెప్పాడు గానీ అవేమీ చిట్టికి అర్థంకాలేదు– అతని కర్థం అయిందల్లా ఒక్కటే–

– ‘దరిద్రులంతా ఆఖరికి కుష్ఠు బతుకు బతుకుతారేమో’ నని.

ఆతర్వాత బస్తీ గుడిసెల మధ్యకి లాంతర్లు పట్టుకొని రాత్రిళ్ళు కొంతమంది వచ్చేవారు– మొదట్లో వాళ్ళు జనాల్ని కూర్చోబెట్టి చదువు నేర్పించటం మొదలు పెట్టారు– మెల్లిగా వాళ్ళు గుడిసెల్లో బతుకుతున్నవాళ్ళు వాళ్ళకి అంత దరిద్రం ఎలాచుట్టుకొంటూ వుందీ చెప్పటం మొదలుపెట్టారు– చిట్టి వాళ్ళతో తరచూ మాట్లాడుతూ వుండేవాడు.

774

కొంతకాలంకి ఓరోజు రాత్రి ఓ లారీలో కొందరు గుండాలు వచ్చారు- వాళ్ళకీ లాంతర్ల వాళ్ళకీ విపరీతమయిన దెబ్బలాట జరిగింది- స్పృహ తప్పిపోయిన వాళ్ళను లాంతర్లతో సహా వాళ్ళు తీసుకొని వెళ్ళిపోయారు.

ఆ తర్వాత ఒకతనుమాత్రం గుడిసెలకు అప్పుడప్పుడూ వస్తూండేవాడు.

చిట్టికి అతనితో దోస్తీ అయింది.

మనుషులు చావు బతుకు లెందుకు బతుకుతున్నారో అతనికి మెల్లిగా అర్థం అవటం మొదలు పెట్టింది.

*   *   *

గదిలో అంతా గోలగా వుంది.

చంద్రశేఖరంకి విసుగొచ్చేస్తుంది- బజారు మూసెయ్యటం వల్ల విపరీతంగా నష్టాలు వస్తాయని అందరికీ తెల్సు- కానీ కూలీ వెధవల్ని మారాంచేస్తే బతకలేం అని అందరూ అనటంవల్ల అతనూ జంకుతున్నాడు- అదీకాక బజారు తెరిచినా వాళ్ళంతా సామానులు మోస్తారని అతనికి నమ్మకం కలగటంలేదు- అందుకే అతనూ ఓపిక పట్టాల్సి వస్తోంది.

"మీరు బజారు తెరవకపోతే కోర్టు కెళ్ళాల్సొస్తుంది" అన్నాడు రంగసామి.

"కోర్టుకెళ్ళినా, నరకానికెళ్ళినా మా కొంపేం మునగదు- మనుషులమీద మనుషులకి నమ్మకం లేకపోయింతర్వాత ఏం అనగలం?"

"ఇందులో నమ్మకం ప్రసక్తి ఏం వుంది" అన్నాడు రంగసామి- "బోనస్ ఇయ్యమంటున్నాం- అంతంత బరువులు మొయ్యించటం అన్యాయం అంటున్నాం- తీసేసిన వాళ్ళను ఎందుకు తీసేసారు అంటున్నాం-"

"చూడు రంగసామీ, బరువుల గురించి మేం ఏంచేస్తాం చెప్పు? గవర్నమెంటుకు రాస్తాం- కొద్దిరోజుల్లో మారచ్చు- ఇకపోతే కూలీరేట్లు పెంచుతాం" అన్నాడు చంద్రశేఖరం.

"అదేటి లాబం" అన్నాడు రంగసామి- "బోనస్ ఇయ్యటాని కెందుకంత యిదీ?" చంద్రశేఖరంకి విసుగొచ్చింది- 'ఇది తేలే తగువుకాదు' అనుకున్నాడు.

తర్వాత వారం రోజులకు

కోర్టు నుంచి అర్డరు వచ్చింది-

775

బజారు తెరవాలని, ప్రజలకు అవసరం అయిన వస్తువులన్నీ గోడవున్లలో పెట్టుకొని బంద్ చెయ్యటం చెల్లదని.

కూలీవాళ్ళ గోల పడలేక ఆపని చేశాం అని బజారుపెద్దలు అన్నారుగానీ జడ్జీగారు వినలేదు.

"వాళ్ళు సక్రమంగానే పని చేస్తాం అని అంటూనేవున్నారు— అంతమంది కడుపులు కాలుస్తూ కూర్చోటం కూడా న్యాయంగాలేదు—" అన్నాడాయన.

"మరి గవర్నమెంటు వాళ్ళు మాకు సాయం వుండకపోతే మేం బతకలేం— అల్లర్లు జరిగితే దాన్ని అదుపులో పెట్టాల్సిన బాధ్యత లా అండ్ ఆర్డర్ వాళ్ళకీ వుంది" అన్నాడు చంద్రశేఖరం— అతనికీ తెల్సు, పోలీసువాళ్ళు ఈ విషయంలో అంత సాయం రాకపోవచ్చని. ప్రోగ్రెసివ్ గవర్నమెంటు అన్పించుకొంటున్న ఈ రాష్ట్ర గవర్నమెంటు కార్మికులమీద పోలీసుల్ని పంపించటంలేదు ఈమధ్య— అదీకాక లేబర్ మంత్రి ఆ మధ్య అసెంబ్లీలో పెద్ద వాగ్వివాదం పెట్టుకొని 'ట్రేడ్ డిస్ప్యూట్లలోకి' పోలీసు బలాన్ని బలవంతంగా దూర్చకూడదనే విషయం సాధించాడు.

* * *

బజారు తెరుస్తున్నారు!

ఆ విషయానికి బస్తీలో జనం లేచి గెంతారు— మూడు నెలలు దాటిపోయింది వాళ్ళకి సరిగా పనిచేసి— ఆకలిగావున్న గుంపు దూరంగా చెరువునీళ్ళో ఆహారం గుట్టో కనబడితే పరిగెత్తినట్లు బజారువైపు పరిగెత్తారు.

* * *

"నల్లబాబుకాడ సొమ్ము లేకేం? ఇయ్యవుగాని!" అని కసురుకొంది చంద్రమతి.

"ఏటే పిల్లా, లేవంటే ఇనుకోవే!" చిరాకుపడ్డాడు నల్లబాబు— అతన్ని కాలాగాడు అని కూడా అంటారు మనుషులు. మనిషి విపరీతమయిన నలుపు. అతనికి పాతికేళ్ళుకూడా వుండవు.

"తొంగోటానికయితే మడిషి మాత్తరం కావాల్నా—"

"ఏటే లంజా— ఏటా పొగరు" నల్లబాబు చేతిలో ఖాళీఅయిపోయిన సారా సీసా పగిలిపోయింది— తారాజువ్వలా కోపం పైకెగిరి మళ్ళీ కిందపడిపోయింది— "ఇలా రాయే—" అన్నాడు సౌమ్యంగా.

776

చంద్రమతి దగ్గరకొచ్చింది.

"అంత కోప్పడకే పిల్లా, నీకు సొమ్ము లేగా కావాల- తెస్తాలేయే-"

నల్లబాబు పేవ్‌మెంట్ మీద పుట్టాడు- అతని అదృష్టం బావుంది కాబట్టి ఏ జంతువూ పీక్కుని తినలేదు- పదేళ్ళ వయసుకి స్వేచ్ఛగా రోడ్లమీద పడ్డాడు.

నల్లబాబు ముష్టి ఎత్తుకోలేదు ఎప్పుడూ.

పన్నెండేళ్ళప్పుడయితే అతను పెద్దరోడ్డు జంక్షన్‌లో వుండేవాడు- హోటళ్ళ ముందు గంటలు గంటలు ఆగివుండే కార్లకు ప్రమాదాలు జరక్కుండా కాపలా కాసేవాడు- 'ఎంతరా?' అంటే, 'రూపాయి' అనేవాడు- ఓసారి ఓ పీనాసి మనిషి 'నాకేం కాపలా అక్కర్లేదు' అని అరిచి వెళ్ళిపోయాడు- అతను పని చూసుకొని వచ్చేసరికి కారు పెట్రోలు టాంకు మూత లేదు- డోర్ హాండిలూ కనపడలేదు- వానపడినప్పుడు తుడుస్తూ ఉండేది అదీ విరిగిపోయింది- అతనికి ఓ మూలగా పళ్ళికిలిస్తూ కూర్చున్న నల్లబాబు కన్పించాడు.

నల్లబాబు తెలివి తక్కువ్వాడు కాదు- కాకపోతే బూట్లు పాలిష్‌చేసే సరంజామా కొని ఆస్తిపరుడవాలని అతను ఆలోచించలేదు- వచ్చిన సొమ్మంతా సినిమాలు చూట్టానికే సరిపోయేది- బీడీలు కూడా కొనేవాడు- తింటానికీ, తలదాచుకోటానికో గుడిసే, ఇవన్నీ ఎప్పుడూ ఖాతరు చెయ్యలేదతను.

ఇళ్ళ చుట్టూ, హోటళ్ళబయటా తిండి పదార్థాలు పారేసినవి దొరికితే తినేవాడు- చిన్నతనంలో పెద్ద పెద్ద గుంపులుగా కుర్రాళ్ళంతా వీధుల్లోపడి తిరిగేవారు- రోడ్లమీద ఎముక ముక్కలు తిండితోబాటు దొరికితే వాటి మూలల్లో ఉండే మాంసం కోసం కొట్టుకొనేవాళ్ళు.

ఆ కొట్లాటల్లో నల్లబాబు చాలామార్లు గెలిచాడు- దాంతో అతను ఓ పదిమంది కుర్రకారు గాంగుకి పెద్దఅయ్యాడు- వాళ్ళ పని చిన్నచిన్న దొంగతనాలూ- బస్సుల్లో, రద్దీ చోట్లలో జేబులు కొట్టటాలూ.

ఒక సారెవరో ఆసామి నల్లబాబుని పట్టుకొన్నాడు- నల్లబాబు జేబుకొడుతూ దొరికిపోయాడు- ఆసామి నీతిగా బతకమని చాలాసేపు చెప్పి, ఊరుకోక దేవుడి గుడికో దానికి తీసికెళ్ళి పాపం గురించీ పుణ్యం గురించీ చెప్పాడు.

అంతా విన్న తర్వాత నల్లబాబు వికారంగా నవ్వాడు.

ఆ తర్వాత గుళ్ళముందు అడుక్కోవటానికీ, జేబులు కొట్టటానికీ అవకాశాలు ఎక్కువని నల్లబాబు కుర్రకారుకి చెప్పాడు.

ఒకోసారి నల్లబాబు న్యాయంగానే సొమ్ములు గడించేవాడు– ఖాళీ సీసాలూ, చిత్తు కాయితాలూ– ఏ చెత్తయినా దొరికితే దాన్ని గోనె సంచుల్లో మోసుకెళ్ళేవాడు– మహానగరంలో ప్రతీ చెత్తకీ ఓ రేటుందని అతనికి తెలుసు– ఏ పనీ లేకపోతే చెత్త కుండీల్లో పేకముక్కలు దొరికితే వాటితో రోడ్డుమీదే కూర్చుని ఆడుతూ కూర్చునేవాడు.

అతనికి పద్దెనిమిదేళ్ళొచ్చాక తెల్సింది– బతుకులో ఆడదాని సుఖం అంటూ వకటి వుందని– దానికి మరిగింతర్వాత అతనికి సొమ్ములు అవసరం మరింత అన్పించింది.

తర్వాత అతన్ని అందరూ 'గుండా వెధవ' అంటం మొదలుపెట్టారు– అలాంటి వాళ్ళు వూర్నిండా చాలామందున్నారు.

పూర్వం బయట దేశాలవాళ్ళు కంపెనీలు చాలా ఆ వూర్లో పెట్టుకొన్నారు– కాపలాకీ, సరుకులు అమ్మటానికీ కొనటానికీ– కత్తులూ కటార్లూ తుపాకులూ ఇచ్చి మనుషులను పెట్టుకొనేవాళ్ళు– వాళ్ళకి కంపెనీకున్న అధికారం అంతా వుండేది– కంపెనీలవాళ్ళ రాజ్యం అయిపోయినా వాళ్ళంతా అలానే వుండిపోయారు– ఇప్పుడు వాళ్ళు కంపెనీల తరపున ఉద్యోగాల్లో లేకపోయినా గుండాలుగా వాళ్ళ బతుకులు వెళ్తానే వున్నాయి.

నల్లబాబు చాలా మందికి పనిచేసేవాడు– కార్మిక సంఘాల్తో గొడవలొచ్చినప్పుడూ, ఎలక్షన్లప్పుడు– అతనికి చేతినిండా పని.

నల్లబాబు భయంకరంగా వుండడు– సన్నగా (పీలగా) వుంటాడు– అయినా ఒకేచేత్తో ఒకనిముషంలో పది షోడాబుడ్లను బాంబుల్లా విసుర్తాడు– మొదట్లో అతనిదగ్గిర చాకులుండేవి– బాగా పేరొచ్చింతర్వాత చిన్న పిస్తోలు సంపాదించాడు 'ఆత్మరక్షణ'కి.

"ఏటా పరాకు" అని చంద్రిమతంటే–

'వూఁ' అన్నాడతను– "నీ సొమ్ములొస్తాయిలే–" అనంటూ బయటకు వెళ్ళిపోయాడు.

* * *

చంద్రశేఖరం అనుకున్నట్లు కాకుండా– ఆ రోజు పోలీసు వాన్‌లు మూడు వచ్చి ఆగి వున్నాయి. ఇనపటోపీల మనుషులు లారీల్లోనూ దిగి నిలబడివున్నారు.

వానలో అక్కడంతా రద్దీగావుంది.

ఒకేసారి జనం అంతా తోసుకు తోసుకు వస్తున్నారు పెద్ద వూరేగింపులా. వూరేగింపుకు ముందు రంగసామి కేకలు వేస్తూ నడుస్తున్నాడు. వెనక్కాల జనాలు కొందరు జెండాలు పట్టుకొని ఆవేశంగా అరుస్తున్నారు.

దూరంగా వున్న ట్రక్కులు రావటానికి జాగా లేక అక్కడే వుండి పోయాయి.

మెల్లిగా కొట్లు తెరుచుకొన్నాయి.

మనుషులు బరువులు ఎత్తుకొంటున్నారు.

కాసేపటికి మొదలయింది పెద్దగొడవ- చాలమంది ముసిలివాళ్ళను తోసేసారు కొందరు 'ఎళ్ళు ఎళ్ళు' అంటూ. బరువులు ఎత్తుతున్న వాళ్ళలో చాలామంది కొత్త వాళ్ళున్నారు.

"ఏటిది ?" అన్నాడు రంగసామి.

"తమ్మూ మన్దేవూరు ?" అన్నాటి చిట్టి.

"బరంపురం–" అన్నాడు.

"ఎంతమందేటో ?" అనడిగాడు చిట్టి.

"ఉండరా- ఓ మూడునాలుగొందలు మురా" అన్నాడు.

"దొంగ లంజికొళ్ళు- తీసినోళ్ళకి పనియ్యరన్నమాట–" అన్నాడప్పల్రాజు.

"బాబొరే, దొబ్బీమంటున్నార్రో–" అంటూ ఏడుస్తున్నాడు గురవయ్య నేలమీద చతికిల పడిపోయి.

అందరికీ మోసం అర్థమయిపోయింది- బరంపురం నుంచి జనాల్ను తెచ్చి కొచ్చారు- ఎత్తుకొన్న సరుకులు దభీమని కిందపడిపోయాయి. మనుషులు కిందపడ్డారు.

"ఏటా అక్కరమం ?" అన్నారు కొందరు.

అప్పుడొచ్చాడు నల్లబాబు- "ఆడి నెందుకు తోసావ్" అన్నాడతను.

"నువ్ ఆడి బాబువా–" అన్నారెవరో. ఆ తర్వాత సోడాబుడ్లు పగిలాయి- మనుషుల వొళ్ళు చిట్లిపోయింది- నల్లబాబు చేతులకు రక్తం అయిపోయింది. వంద మంది దాకా రక్తం చిట్లించారు.

కాసేపటికి పోలీసు వాళ్ళొచ్చారు.

779

మూడునాలుగు వేనుల్లోనూ సరిపడ జనంని తీసికెళ్ళిపోయారు.

"మేం కొట్లు తెరుచుకొని యాపారం చేస్కొందామంటే, పనోళ్ళని అరెస్టు చేసుకుపోయారు" అని చంద్రశేఖరం పోలీసు స్టేషన్‌లో అన్నాడు.

ఆ తర్వాత వాళ్ళు కొంతమందిని వుంచి మిగతావాళ్ళను వొదిలేసారు.

* * *

"ఏటి మనుషులంతా జాగా కాడకు రావడం మానీసి, రోడ్లంబటా, స్టేషన్లంబటా తిరుగుతుంటే ఏటి బలం?" అన్నాడు రంగసామి.

"మరి జనాలు తిండిలేక సావరా లేకుంటే–" అన్నాడు చిట్టి.

"నువ్వేటి పెద్ద లీడరయి పోయావేటి? మేం సావలేదే?" రంగసామికి చిట్టి మీద ద్వేషం పెరుగుతోంది.

"యూనియన్ వాళ్ళు కానోళ్ళను గాలి కొగ్గీస్తున్నావ్, అదేటి న్యాయం?"

"ఆళ్ళకు మనవేటీ సెయ్యలేం– లేబర్ రూల్సున్నాయి– ఆటి ప్రకారమే మనం పోరాడాలి– నీకు బుద్ది తక్కువా తొందరెక్కువా అనుత్తినే అన్లేదునేను."

"చస్ నీయమ్మ, నోర్మూసుకోరా–"" అంటూ చిట్టి వెళ్ళిపోయాడు.

"చావండి, బజారు మూసిపారదొబ్బారు– తిండ్లేక చావండర్రా– నేను యూనియన్ కోసమే చూస్తాను– యూనియన్‌లో లేనోళ్ళ గురించి నేన్సూడను– చావండి" అన్నాడు రంగసామి గట్టిగా సిగరెట్టు దమ్ము పీల్చి వదుల్తూ.

* * *

వారం అయింది.

చిట్టికి జ్వరం వస్తోంది.

దానికితోడు నిన్న జనం అంతా దిగాలు ముఖాలు వేసుకొచ్చారు– కొంతమంది నేలమీద కూర్చుండి పోయారు– కొంతమంది విపరీతంగా ఏడుస్తున్నారు.

"చిట్టిబాబూ, పేణాలు పోతున్నాయి మాకా కూలి నేదు– రచ్చించే మొగుడే లేడు– బస్సుల్లో కసింత పస్చిసి ఓ రొట్టిముక్కయినా తిని ఇన్ని టీ నీల్లు తాగుదామంటే దానికీ పేదే కొట్టార్రా నాయనా...."

780

చిట్టి కంగారుగా లేచి నిలబడ్డాడు; "ఏటయింది అళ్ళు పొమ్మన్నారా?"

"ఆళ్ళు పొమ్మన్లేదు, ఇయేళక్కడికి బస్సోనర్లంతా తయారు- క్లీనర్లందర్నీ దెంగులుపెట్టారు- మాచేత బస్సులు కడిగించటం లాంటి పన్లవీ చేయించుకొంటే ఆళ్ళనీ పనుల్లోంచి పీకేస్తాం అన్నారు- నల్లబాబుగాడో పదిమంది జనాల్తో దెబ్బలాట కూకుర్చున్నాడు- ఏటి సేస్తాం సెప్పు?"

"ఏటి సేసినా జనం అందరం ఒక్కటవాలి- మనల మనం అమ్ముకొని ఆళ్ళకు బానిసలవం" అన్నాడు చిట్టి.

మధ్యానం నుంచీ వాన పడ్తోంది.

గుడిసెల్లో మధ్యన మోకాలు లోతుకి నీళ్ళొచ్చేసాయి- అంతా చీదర చీదరగా తయారయింది.

ఉదయం అయేసరికి అక్కడ గుడిసెల్లో ఉన్నవాళ్ళకి చాలామందికి జ్వరాలొచ్చాయి. వాంతులయ్యాయి- కొంచెం దూరంలో ఉన్న ఛారిటీ మిషను వాళ్ళు రెండు మూడు అంబులెన్సులలో మనుషులందర్నీ తీసికెళ్ళారు.

నీలమ్మకూడా వాంతుల్లా అయ్యాయి- కడుపులో విపరీతమయిన నొప్పి.
సాయంత్రంకి పదిమంది చచ్చిపోయాడు- నీలమ్మతో నలుగురు ఆడవాళ్ళు.
"పొట్టల్లో ఏవీ లేదు- అరగని గడ్డి తప్పించి" అన్నారు డాక్టర్లు.

* * *

రంగసామికీ చిరాగ్గావుంది.

కోరుకున్న వాటిలో ఏవీ నెగ్గేలా తనకు అన్పించటంలేదు. బరువులు తగ్గించటం మా చేతుల్లో లేవంటున్నారు. అదీకాక చిట్టి వ్యవహారం అతనికి మంటకలిగిస్తోంది. అందుకే అతనన్నాడు.

"ఇయాల్టితో ఈ తగువు తేలిపోవాల. లేపోతే జరిగే గొడవలకు నాను సమాదానం కాదు" అని- చంద్రశేఖరంకి గుండెల్లో రాయిపడింది. అటు గవర్నమెంటు సాయంవచ్చేలా అతనికి కనబట్టంలేదు. ఇటు రంగసామి తంతు చూస్తే 'అరాచకం'కి దారివొదిలేసేలావున్నాడు.

"అంటే ఏమిటి?" అన్నాడు చంద్రశేఖరం.

781

"ఇయాళతో యూనియన్‌కీ మీకూ రాజీ కుదర్దం మంచిదని. యూనియనోళ్లందరూ మండి పడ్తున్నారు."

"మీరు రూల్సు ప్రకారం మాట్లాట్టంలేదు. మాదగ్గిర పనోళ్ళు కానోళ్ళందరికీ బోనసేమిటి?"

"అన్నీ మీరు చేసిన గందరగోళాలేనాయె- వారానికీ పదిరోజులకీ మనిసిపేరు మార్చేసి ఆడు మా పనోడు కాదంటారు మీరు-"

"రంగసామీ, ఒకటే మాట- యూనియన్ వోళ్ళందరికీ బోనసిస్తాం- ఐదేళ్ళుగా ఒకేచోట పన్జేస్తున్న వోళ్ళకి ఉత్తరం ఇస్తామంటాం. బరువుల గురించి గవర్నమెందోళ్ళకు రాస్తాం- పోతే బస్తాకి ఐదేసి పైసలు కూలి రేటు పెంచుతాం-" అన్నాడు చంద్రశేఖరం- అతనికీ తెల్సు అంతకన్నా తెగకొట్టటం కష్టం అని- యూనియన్‌తో ఏ ఒప్పందం పెట్టుకొన్నా గొడవలు తగ్గిపోతాయని అతని నమ్మకం.

"యూనియన్ వాళ్ళ తరఫున మేం కొపరేట్ చేస్తాం- మిగతా వోళ్ళకి నే గారంటీ ఇవ్వలేను" అన్నాడు రంగసామి.

"చిట్టిబాబు నీ యూనియన్ వోడేగదా-"

"ఆడ్ని నీనెప్పుడో బయటోడికింద జమకట్టేశాను" అన్నాడు.

"ఆడేదయినా గోలచేస్తే బాధ్యతెవర్ది-"

"నాది కాదు."

• • •

బజారు తెరిచారు.

పని దొరికిందేచాలని దరిద్రులంతా పరిగెత్తారు.

యూనియన్ ఒప్పందం కొచ్చేసిందని అందరికీ తెల్సింది.

బజారంతా హడావిడిగా వుంది.

సుందర్రావు పార్టీ వర్కర్లతో స్వయంగా బరువులు ఎత్తుతూ పని ఆరంభం చేసాడు.

చిట్టి జ్వరంతోనే వెళ్ళాడు.

"బాబోరే దొబ్బేమంటున్నార్రో-" అంటూ ఏడుస్తూ వచ్చాడు గురవయ్య. అతన్తోపాటు చిట్టితో తిరిగిన వాళ్ళందరూ ఏడ్పు ముఖాలు వేసుకొచ్చారు.

782

"మాకు సొమ్ములూ లేవు పనీ లేదు ఏటి సిట్టిబాబూ–" అన్నాడు అప్పల్రాజు.

చిట్టి యూనియన్ రూమ్ వైపు పరిగెత్తాడు.

లోపల రంగసామి తాపీగా సిగరెట్టు తాగుతున్నాడు.

"ఏటి గురూ– బోనస్ దొరికిందేటి?" అన్నాడు చిట్టిని చూస్తూ.

"ఛఫ్ లంజకొడకా, తార్పుడు నా కొడకా– జనాలందరి పొట్టలు కొట్టి ఏటి నీ వప్పందం–" చిట్టి రంగసామి లాల్చీ పట్టుకోని రూమ్ బయటకు ఈడ్చుకొచ్చేశాడు.

"ఏంటిది, వొదులు వొదులు, పిచ్చట్టిందేటి–" అరిచాడు రంగసామి.

"పిచ్చి సీకురా అట్టింది."

రంగసామి ముఖంమీద నాల్గు గుద్దులు పడ్డాయి.

కాసేపటికి అక్కడంతా జనం పోగయిపోయారు– మనుషుల్లో మనుషులు కొట్టుకొన్నారు.

"ఒరేయ్ అప్పల్రాజూ–" అరిచాడు చిట్టి.

అప్పటికే నల్లబాబు రంగసామిని చిట్టి చేతుల్లోంచి విడిపించేశాడు– అతని చేతుల్లో ఉన్న చాకు చిట్టి ముఖాన్ని చీరేసింది– పొట్టలోంచి రక్తం చిమ్మింది– చేతులు ఎర్రగా ఏడుస్తూ రక్తాన్ని కారుస్తున్నాయి.

అప్పల్రాజు పరిస్థితీ అలానే వుంది– అతను తిన్న దెబ్బలకు స్పృహ తప్పిపోయాడు.

"లంజ కొడుకుల్లారా– మనిషిని సంపితే జనం సల్లపడిపోర్రా– ఒరేయ్ తమ్ముళ్ళా జడవకండి. ప్రళయం వచ్చేవరకూ మనం ఒకటీ అరా ఇట్లా రాలిపోతూనే వుంటాం. జడవకండి–" అరుస్తున్న అరుపు ఆగిపోయింది.

జనంకి చిట్టి రక్తం బీభత్సంగా కన్పిస్తోంది.

• • •

మర్నాటి నుంచీ మనుషులంతా బరువులు మామ్మూలుగా ఎత్తుతూనే వున్నారు.

• • •

విప్లవాలకు ముందు చెదురుమదురుగా మొలకెత్తే నిప్పుకణాలు గాలికి ఎగిరిపోతూనే వుంటాయి– నిప్పుకణాల్ని ఎగరగొట్టి బూడిదగామార్చే గాలే, మంటను పెద్దది చేస్తుంది.

783